PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 192 | విజయవాడ, సోమవారం 13 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 13 February 2023 | Rs



శాస్త్ర, సాంకేతిక రంగాలతో దేశాభివృద్ధి

- జన విజ్ఞాన వేదిక జాతీయ సదస్సులో వక్తలు

లోపలి పేజీలో..



రఫ్ఫాడించిన రోడ్రిగ్స్

- పాకిస్తాన్ మహిళలపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు

లోపలి పేజీలో..



త్రిపుర సంఘీభావ సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, వేదికపై బివి రాఘవులు తదితరులు

త్రిపురలో నిర్బంధకాండ

- స్వేచ్ఛగా ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు
- ప్రజాస్వామ్యవాదులు సంఘీభావం తెలపాలి
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్రిపుర రాష్ట్రంలో ఈ నెల 16వ తేదీన జరగాల్సిన ఎన్నికలను సజావుగా జరగనివ్వకుండా బిజెపి నిర్బంధకాండను విధిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రత్యర్థుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని చెప్పారు. త్రిపుర పరిణామాలను ప్రజలందరి దగ్గరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. త్రిపురలో ఎన్నికలు సజావుగా జరగాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సిపిఎం విజయవాడ కమిటీ ఆధ్వర్యంలో త్రిపుర సంఘీభావ సభ ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తలుగా ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, బివి రాఘవులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బేబి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత మాణిక్ సర్కార్‌తోపాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కనీసం వారివారి నియోజకవర్గాల్లోని ప్రజలను కూడా కలుసుకోనివ్వకుండా బిజెపి ప్రభుత్వం త్రిపురలో అడ్డంకులు సృష్టిస్తోందని తెలిపారు. ఇప్పటికే 200 మంది సిపిఎం కార్యకర్తలను హత్య చేసిందని, పోలీసుల సహకారంతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు సిపిఎం కార్యాలయాలను నాశనం చేశారని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మోసపూరిత హామీల వల్ల బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ విధానాల పట్ల త్రిపుర ప్రజలు చాలా అసంతృప్తిలో ఉన్నారని తెలిపారు. పోలీసుల సాయంతో ఎన్నికల్లో విధ్వంసం సృష్టించి గెలిచేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. అతిచిన్న రాష్ట్రమైన త్రిపురలో ఇప్పటికే ప్రధాన మంత్రితో సహా కేంద్రమంత్రులు, బిజెపి రాష్ట్రాల ముఖ్యమంత్రులు అక్కడే తిష్టవేశారని పేర్కొన్నారు. సాధారణంగా ఎన్నికల విధుల కోసం పక్కరాష్ట్రాల నుంచి పోలీసు బలగాలను రప్పిస్తారని, త్రిపుర బిజెపి ప్రభుత్వం మాత్రం గుజరాత్, అస్సాం రాష్ట్రాల పోలీసులను రప్పిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో బిజెపి ఎటువంటి దమనకాండకు పాల్పడుతుందో, తొత్తడం చేస్తుందనే ఆందోళన ఇతర పార్టీలకు నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో త్రిపురకు సంఘీభావంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిలవాలని కోరారు. ఎపి పోరాటాల గడ్డగా ఉందని, తెలంగాణ వంటి సాయుధ పోరాటాలు ఇక్కడ జరిగాయని తెలిపారు. బివి రాఘవులు మిగతా 2లో

రైతు రుణాలపై

వడ్డీ రాయితీ కట్

- కేంద్రం చర్య
- 2 నుంచి 1.5 శాతానికి తగ్గింపు

- బ్యాంకులకు భారం
- కో-ఆపరేటివ్స్, ఆర్ఆర్‌బిలపై ఎక్కువ
- వ్యవసాయ అప్పుల పంపిణీపై ప్రభావం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతు రుణాలపై వడ్డీ రాయితీకి కేంద్రం కత్తెర పెట్టింది. ఆర్థిక సంస్థలకు చెల్లించే సబ్సిడీలో 0.5 శాతం తగ్గించింది. వడ్డీ రాయితీ కుదింపు వలన రైతులకు పంట రుణాలిస్తున్న బ్యాంకులపై ఆర్థిక భారం పడనుంది. బ్యాంకులపై భారం పడే సందర్భంలో అవి రైతులకు పంపిణీ చేసే రుణాలకు కోతలు పెట్టే అవకాశాలున్నాయి. ముఖ్యంగా రైతులకు రుణాలిచ్చే సహకార బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులపై వడ్డీ భారం పడుతుందని ఆయా సంస్థలు చెబుతున్నాయి. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో, నష్టాల్లో ఉన్న తమపై వడ్డీ భారం అదనమని వాపోతున్నాయి. మరోవైపు జాతీయ బ్యాంకులు సైతం వడ్డీ భారం మోయలేమంటున్నాయి.

ఇదీ నేపథ్యం

అధిక వడ్డీలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు రూ.మూడు లక్షల లోపు పంట రుణాలను ఏడు శాతం వడ్డీకే బ్యాంకుల నుంచి ఇప్పించాలని యుపిఎ-1 ప్రభుత్వం పాలసీగా పెట్టుకుంది. బ్యాంకులు 9 శాతం వడ్డీ వసూలు చేస్తుండగా రెండు శాతాన్ని బ్యాంకులకు కేంద్రమే రీయింబర్స్ చేస్తుంది. అప్పుడు 7 శాతానికి బ్యాంకులు రైతులకు రుణాలిస్తాయి. సకాలంలో రీపేమెంట్ చేసే రైతులకు మరో మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. ఏతావాతా నాలుగు శాతం వడ్డీకి రైతులకు పంట రుణాలందాలి. మన రాష్ట్రం రూ.లక్ష లోపు లోన్లకు ఆ నాలుగు శాతం వడ్డీ భరించడం వలన 'సున్నా' వడ్డీకి రుణాలందాలి. కాగా మోడీ ప్రభుత్వం తాజా పరిచిన వడ్డీ రాయితీ పథకం (మోడిఫైడ్ ఇంటరెస్ట్ సబ్వెన్షన్ స్కీం-ఎంఐఎస్‌ఎస్)ను తెచ్చింది. బ్యాంకులకు ఇంతవరకు కేంద్రం రీయింబర్స్ చేస్తున్న 2 శాతానికి బదులు 1.5 శాతమే రీయింబర్స్ చేస్తామంటోంది. 0.5 శాతం తగ్గించింది.

ఆ మేరకే మొన్న బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేసింది. దీని వలన నేరుగా రైతులపై భారం పడకున్నా ప్రభావం ఉంటుంది. ఇప్పటి వరకు బ్యాంకులకు కేంద్రం నుంచి అందే వడ్డీ రాయితీ తగ్గిపోతుంది. కేంద్రం తగ్గించిన అర శాతం వడ్డీ భారాన్ని బ్యాంకులే పెట్టుకోవాలి. ఆ వంకతో బ్యాంకులు రైతులకు పంట రుణాలు తగ్గించే అవకాశం ఉంది.


వాటిపై అధిక ప్రభావం

కో-ఆపరేటివ్స్, ఆర్ఆర్‌బిలకు వడ్డీ భారం ప్రభావం బాగానే ఉంటుందని సదరు బ్యాంకర్లు చెబుతున్నారు. ఉదాహరణకు ఆప్కాబ్, డిసిసిబిలు కలిసి ఏడాదికి రూ.20 వేల కోట్ల వరకు అప్పులిస్తాయి. కేంద్రం వడ్డీ రాయితీ అర శాతం తగ్గించడం వలన సుమారు రూ.50 కోట్ల వరకు సొంతంగా పెట్టుకోవాలని ప్రాథమిక అంచనా. ఆర్ఆర్‌బిలకూ ఇలాంటి పరిస్థితే ఉంటుందంటున్నారు. నాబార్డు రీఫైనాన్స్ చేసినా ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. అలాగే నాబార్డుపైనా ఇంటరెస్ట్ భారం పడుతుందని అభిప్రాయపడుతున్నారు. అసలే నష్టాల్లో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కో-ఆపరేటివ్స్, ఆర్ఆర్‌బిలకు వడ్డీ రాయితీ కుదింపు ఇబ్బందేనంటున్నారు. ఇప్పటికే కేంద్రం ఇస్తామన్న 2 శాతం వడ్డీ రాయితీ సకాలంలో విడుదల చేయట్లేదు. ఒక్కోసారి సంవత్సరాలు సైతం పడుతోంది. ఇప్పుడు ఇస్తానన్న రాయితీకే కోత పెట్టి బ్యాంకులపై ఆ భారాన్ని నెట్టి రైతులకు రూ.లక్షల కోట్లల్లో రుణాలిప్పిస్తామనడం చర్చనీయాంశమైంది.

గవర్నర్‌గా

జస్టిస్ నజీర్

- చత్తీస్‌గఢ్‌కు విశ్వభూషణ్ బదిలీ



జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర నూతన గవర్నర్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్రపతి భవన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటి వరకు గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించిన విశ్వభూషణ్ హరిచందన్‌ను చత్తీస్‌ఘడ్ గవర్నర్‌గా బదిలీ చేశారు. విశ్వభూషణ్ అకస్మికంగా బదిలీ చేసి, సాధారణ ఎన్నికల ముందు నూతన గవర్నర్‌ను నియమించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నూతన గవర్నర్‌గా నియమితులైన అబ్దుల్ నజీర్ కర్నాటకలోని బెలువాయిలో ఫకీర్‌సాహెబ్ దంపతులకు 1958 జనవరి 5న జన్మించారు. మహావీర కళాశాలలో బికాం డిగ్రీ పూర్తి చేశారు. మంగులూరులోని కొడియాల్‌బైల్‌లోని ఎస్‌డిఎమ్ కళాశాల నుంచి న్యాయపట్టా పొందారు 1983లో న్యాయవాదిగా కర్నాటక హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2003 మే నెలలో కర్నాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2017 ఫిబ్రవరి 17న నజీర్ సుప్రీంకోర్టు న్యాయ మూర్తి గా పదోన్నతి పొందారు. అయోధ్య -బాబ్రీ మసీదు వివాదం, నోట్ల రద్దు, గోప్యత హక్కు, ట్రిపుల్ తలాఖ్ లాంటి కేసుల్లో తీర్పు వెలువరించిన ధర్మాసనంలో ఆయన ఒకరు. నూతన గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్‌నజీర్‌కు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. అబ్దుల్ నజీర్ మార్గనిర్దేశంలో రాష్ట్రం మరింత పురోగమిస్తుందన్న ఆశాభావాన్ని సిఎం వ్యక్తం చేశారు.

గిట్టుబాటు ధరల కోసం

మరోసారి దేశవ్యాప్త ఉద్యమం

సంయుక్త కిసాన్ మోర్చా నేత రాకేష్ తికాయత్



రైతుగర్జన సదస్సులో మధు, ఆర్ నారాయణమూర్తి, జస్టిస్ గోపాల గౌడ, వడ్డే శోభనాద్రీశ్వరరావు, రాకేష్ తికాయత్, రావుల వెంకయ్య, వెంకట్ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిట్టుబాటు ధరల కోసం మరోసారి దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా నేత రాకేష్ తికాయత్ పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని దాసరిభవన్‌లో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో రైతుగర్జన సదస్సు జరిగింది. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాకేష్ తికాయత్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడి ప్రభుత్వం ఢిల్లీరైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన లిఖితపూర్వక హామీలలో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, గిట్టుబాటు ధరలకోసం మరోసారి ఉద్యమించక తప్పని స్థితి ఏర్పడిందని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ రైతులు తెలిపిన సంఘీభావం మరువలేనిదన్నారు. మోడి ప్రభుత్వం డిజీల్ వాహనాలు రద్దుచేయడం, డీజిల్‌పై సబ్సీడీలను ఎత్తి వేయడంలాంటి చర్యలకు పాల్పడుతూ రైతు వ్యతిరేక విధానాలకు పూనుకుందన్నారు. రైతులు వ్యవసాయంలో వినియోగించే ట్రాక్టర్లను లేకుండా చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి రూ 15లక్షలు బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని చెప్పి 5కెజిల గోదుమలను అందించలేక పోతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ గోపాలగౌడ మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతుల జీవనప్రమాణాలు చాలా దారుణంగా వున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని నాల్గో తరగతి ఉద్యోగి కంటే రైతు ఆదాయం తక్కువగా వుంటోందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే రైతుల ఆదాయంను రెట్టింపు చేస్తామని వాగ్దానం చేసిన పాలకులు ఇపుడు ఆ రైతును వ్యవసాయంనుండి వెళ్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ ఢిల్లీ ఉద్యమం నేపథ్యంలో దేశ ప్రజల ముందు కన్నీరు పెట్టిన మోడీ ఆచరణలో తన కార్పోరేట్ ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన మిగతా 2లో

ప్రత్యామ్నాయ విద్యావిధానం రావాలి

- బాలోత్సవంలో విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య

అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం విఫలం

- మేకిన్ ఇండియా జోకిన్ ఇండియాగా మారింది
- దేశంలో అడ్డగోలుగా ప్రయివేటీకరణ
- తెలంగాణ సిఎం కెసిఆర్

యాంత్రీకరణ బిల్లులు పెండింగ్

- హైకోర్టుకెక్కుతున్న సప్లై సంస్థలు

లోపలి పేజీలో..



ఢిల్లీలో బిజెపి కార్యాలయం సమీపంలో ఆందోళన చేస్తున్న ఆమాద్మీ పార్టీ కార్యకర్తలు

అదానీపై ఆప్ నిరసనల హోరు

- ఢిల్లీ, పంజాబ్ బిజెపి ప్రధాన కార్యాలయాల వద్ద ఆందోళన

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ సన్నిహితుడైన కార్పొరేట్ అధిపతి గౌతమ్ అదానీ అక్రమాలకు వ్యతిరేకంగా ఆమాద్మీ పార్టీ (ఆప్) నేతృత్వంలో ఆదివారం న్యూఢిల్లీలోనూ, పంజాబ్‌లోనూ బిజెపి ప్రధాన కార్యాలయాల వద్ద ఆదివారం భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టారు. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపించాలని నినాదాలతో హోరెత్తించారు. వేర్వేరు పార్టీల నేతలు సభ్యులుగా సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించాలని ఆమాద్మీ పార్టీ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ డిమాండ్ చేశారు. ఆమాద్మీ పార్టీ కార్యకర్తలు అదానీ అక్రమాలను నిరసిస్తూ చండీగఢ్‌లోనూ ఆందోళనలు చేపట్టారు. నిరసనకారులు భారీ ప్రదర్శనగా బిజెపి పంజాబ్ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అప్పటికే కొందరు కార్యకర్తలు బిజెపి కార్యాలయం వైపు దూసుకెళ్తుండటంతో వారిపై జలఫిరంగులను ప్రయోగించి చెదరగొట్టారు. పలువురు ఆప్ నేతలను, కార్యకర్తలను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.



బిసి మండల్ విగ్రహావిష్కరణలో నాయకులు (ఇన్‌సెట్‌లో) మండల్ విగ్రహం

దేశవ్యాప్తంగా బిసి జనగణన

- ఆత్మగౌరవ సభ డిమాండ్
- గుంటూరులో బిపి మండల్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశ వ్యాప్తంగా బిసి జన గణన అన్ని రాష్ట్రాల్లో చేపట్టాలని గుంటూరులో జరిగిన బిసి ఆత్మగౌరవ సభ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. గుంటూరు-అమరావతి రోడ్డులో ఆదివారం బిపి మండల్ విగ్రహాన్ని ఆవిష్కరణ సందర్భంగా జరిగిన ఈ సభకు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అధ్యక్షత వహించారు. రాజ్యాంగం ప్రకారం బిసిలకు దక్కాల్సిన హక్కులు, రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు బిసి జనాభా గణన తప్పనిసరి ఈ సభ పేర్కొంది. జనాభా ప్రాతిపదికన బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేసింది. ద్రవిడ కళగం పార్టీ అధ్యక్షులు కె. వీరమణి పలువురు బిసి నాయకులతో కలిసి బిపి మండల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిసిలు 52 శాతం మంది ఉన్నారని, వీరికి 27 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న నిబంధన దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. రిజర్వేషన్ల శాతం 50 శాతం దాటకూడదన్న నిబంధనను కేంద్ర ప్రభుత్వమే ఉల్లంఘించిందని విమర్శించారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు పది శాతం అమలు చేసిన తరువాత 60 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ఈ నిబంధన ఉల్లఘించినట్టేనని పేర్కొన్నారు. విసికె పార్టీ అధ్యక్షులు తిరుమావళవన్ మిగతా 2లో

ఎయిర్‌పోర్టు నిర్వాసితులు చెల్లాచెదురు

- పునరావాసానికి నోచుకోని వలస కూలీలు, యువత
- పోలీసు బందోబస్తు మధ్య గ్రామాలను ఖాళీ చేయిస్తున్న అధికారులు



మరడపాలెంలో ఇంటిని జెసిబితో కూల్చేస్తున్న దృశ్యం



మరడ పాలెం నుంచి వేరే చోటకు తరలిపోతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వ నిర్వాకంతో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితులు చెల్లాచెదురవుతున్నారు. ఎక్కడ తలదాచుకోవాలో ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతమవుతున్నారు. ఇటువంటి తరుణంలో కొంతగడువు ఇవ్వాల్సిన అధికార యంత్రాంగం ఇళ్లు ఖాళీ చేయకపోతే తామే కూల్చేస్తామంటూ బెదిరిస్తూ పోలీసులను మోహరింపజేయడంతో బాధితులంతా బిక్కుబిక్కుమంటూ మూటాముళ్లు సర్దుకుంటున్నారు. తమపై ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని, ఇటువంటి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రశ్నేలేదని అధికారులు చెప్తున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు కోసం సుమారు 2,700 ఎకరాలు భూమిని సేకరించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మరడపాలెం, బొల్లెంకులపాలెం, ముడసర్లపాలెం, రెల్లిపేట గ్రామాలు పూర్తిగా ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తం 367 నిర్వాసిత కుటుంబాలను అధికారులు గుర్తించారు. గూడెపువలస, లింగాలవలస రెవెన్యూ పరిధిలో స్థలాలు కేటాయించింది. భూములు, ఇళ్లు, చెట్లకు నష్టపరిహారంతోపాటు ప్రతి కుటుంబానికీ ఐదు సెంట్ల స్థలం, 9.50 లక్షల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పిస్తామని 2015లో అప్పటి ప్రభుత్వం తెలిపింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పనకు అదుగో ఇదిగో అంటూ నెట్టుకొస్తూ 2021లో మంజూరు చేసింది.

పునరావాసానికి నోచుకోని వలస కుటుంబాలు

తొలుత ఒప్పందం కుదిరిన సమయంలో ఆయా గ్రామాల్లో చాలామంది ఉపాధి కోసం వలస వెళ్లడంతో నాయకులుగానీ, అధికారులుగానీ వారిని గుర్తించలేదు. దీంతో, మరడపాలేనికి చెందిన నీలాపు నర్సయ్యమ్మ, నీలాపు అప్పయ్యమ్మ, నీలాపు అప్పన్న, నీలాపు సునీత, నీలాపు చిన అప్పయ్యమ్మలతోపాటు సుమారు 34 మంది పునరావాసానికి నోచుకోలేదు. మిగిలిన మూడు గ్రామాల్లో కూడా ఇటువంటి వారు మరికొందరు ఉన్నారు. వీరంతా తమకు స్థలాలు కేటాయించాలని చాలాకాలంగా అడుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా బలవంతంగా ఖాళీ చేయించేందుకు వచ్చిన అధికారులను నిలదీయడంతో ఆర్ అండ్ ఆర్ చట్టంతో సంబంధం లేకుండా 1.5 సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. తమకు కూడా అందరితోపాటు ఐదు సెంట్ల స్థలాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. భూములు తీసుకోవడానికి మాత్రం స్థానికులమనే ధ్రువీకరణ పత్రాలు అడగలేదని, అందరితోపాటు స్థలాలు, ఇళ్ల కట్టుకోవడానికి డబ్బులు అడిగితే స్థానికతతో కూడిన ఆధార్ కార్డులు చూపించమంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డుల్లో స్థానిక చిరునామాలు లేకపోవడం వల్ల ప్యాకేజీ వర్తింపజేయలేమని అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారు.

అన్ని ఆధారాలూ ఉన్నా...

మరడపాలెంలో రేషన్, ఆధార్ కార్డులు ఉన్నా కొంతమందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయలేదు. ఇదే గ్రామానికి చెందిన మిగతా 2లో

త్రిపురలో నిర్బంధకాండ

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ త్రిపురలో బిజెపికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. అందుకనే చేసిన అభివృద్ధి గురించి చెప్పి ఓట్లు అడగకుండా విద్వేషాలు సృష్టించి లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. త్రిపురలో అధికారంలోకి వచ్చిన బిజెపి.. సిపిఎం కార్యకర్తలకు చెందిన రెండు వేల చేపల చెరువులను ధ్వంసం చేసిందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామంగా ఎన్నికలు జరిగే పరిస్థితి ఉండాలని కోరారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రాలతో కూడిన దేశాన్ని ఒకే నినాదంతో పేరుతో విధ్వంసం చేస్తోందని పేర్కొన్నారు. బిజెపి అవలంభిస్తున్న దుష్ట విధానాలను అడ్డుకుంటూ, ప్రశ్నిస్తున్న సిపిఎం, వామపక్షాలు లేకుండా చేయాలని అనుకుంటోందన్నారు. త్రిపురలో బిజెపి చేసే హింసను దేశమంతటికీ తెలియజేయాలన్నారు. అప్పుడే ఇతర రాష్ట్రాలు జాగ్రత్తపడతాయని చెప్పారు. ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే విధంగా దేశవ్యాప్తంగా ప్రజలు గళం విప్పాలని కోరారు. సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ దేశంలో పౌరహక్కులు ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. పెరుగుతున్న ధరలు, రైతులు సమస్యలు, అసంఘటిత కార్మికుల ఇబ్బందులపై బిజెపి నోరుమెదపదన్నారు. త్రిపురలో జరుగుతున్న అప్రజాస్వామిక విధానాలపై రాష్ట్రంలో ఉన్న పార్టీలు నోరువిప్పాలని కోరారు. లేదంటే ఇదే పరిస్థితి రాష్ట్రంలో కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు డి కాశీనాథ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, నాయకులు ఎం శ్రీదేవి, భూపతి రమణ, బి సత్యబాబు, టి ప్రవీణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ నజీర్ నియామకం వివాదాస్పదం

- న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ముప్పు : జైరామ్ రమేష్
- ప్రజాస్వామ్యానికి మచ్చ : ఎఎ రహీమ్



అయోధ్య వివాదంపై తీర్పు ఇచ్చిన బెంచ్‌లోని న్యాయమూర్తులు
(ఎడమ నుంచి కుడికి జస్టిస్ అశోక్ భూషణ్, ఎస్ఎ బాబ్డే, రంజన్‌గొగాయ్, డివై చంద్రచూడ్, ఎస్ అబ్దుల్ నజీర్)

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర నూతన గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్ నియామకం వివాదాస్పదంగా మారింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా గత నెల నాల్గవ తేదిన రిటైర్ అయిన ఆయనకు వెంటనే గవర్నర్ గిరీ కట్టబెట్టడమే దీనికి కారణం. గవర్నర్లుగా ఎవరిని నియమించాలన్నది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదే అన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతో పాటు సీనియర్ అధికారులు రిటైర్ అయిన వెంటనే ఇటువంటి ఉన్నత బాధ్యతలు అప్పగించడంతో వారు విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఇచ్చిన తీర్పులు, చేసిన పనులపై చర్చకు దారి తీస్తోంది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గోగాయ్‌ను నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యసభకు నామినేట్ చేసినప్పుడు పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. బాబ్రీ మసీదు- రామజన్మభూమి వివాదంపై తీర్పు ఇచ్చిన బెంచ్‌కు గోగాయ్ నేతృత్వం వహించారు. ఆ తీర్పుతోనే అయోధ్యలో రామమందిర నిర్మాణానికి మార్గం సుగమమైంది. రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన అబ్దుల్ నజీర్ కూడా రామజన్మభూమిపై తీర్పు ఇచ్చిన న్యాయమూర్తుల బెంచ్‌లో సభ్యులుగా ఉండటం గమనార్హం. అయోధ్య వివాదాన్ని విచారించిన బెంచ్‌లో ఉన్న మరో జడ్జి అశోక్ భూషణ్ 2021 జులైలో రిటైర్‌కాగా, ఆయన్ను నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు అధినేతగా నియమించారు. ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ కూడా అయోధ్య బెంచ్‌లో సభ్యులే. ఆ బెంచ్‌లో సభ్యులుగా ఉండి రిటైర్ అయిన మాజీ సిజెఐ ఎస్ఎ బాబ్డే మినహా ప్రతి ఒక్కరికీ ఏదో పదవి దక్కింది. బాబ్డేకు కూడా త్వరలో పదవీయోగం ఉందన్న వార్తలు వస్తున్నాయి. అయోధ్య వివాదంతో పాటు, రాఫెల్ జెట్ ఫైటర్ అంశంపై చెలరేగిన వివాదం కూడా గొగాయ్ నేతృత్వంలోని బెంచ్‌ముందుకే వచ్చింది. ఆ వివాదంలో వచ్చిన తీర్పు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దాదాపుగా అంతే ప్రాధాన్యత ఉన్న నోట్ల రద్దు కేసు విచారించిన బెంచ్‌కు జస్టిస్ అబ్దుల్ నజీర్ నేతృత్వం వహించారు. నోట్లరద్దు జరిగిన ఆరు సంవత్సరాల తరువాత జరిగిన విచారణ ప్రక్రియలోనైనా కేంద్ర ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకునే విధంగా అత్యున్నత న్యాయస్థానం చర్యలు ఉంటాయని దేశ ప్రజానీకం భావించింది. అయితే, 4-1తో కేంద్ర ప్రభుత్వానికి అనుకూల తీర్పును బెంచ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే మాజీ న్యాయశాఖ మంత్రి, బిజెపి నేత అరుణ్‌జైట్లీ 2012లో 'రిటైర్‌మెంట్ తరువాత పదవులు... విరమణకు ముందు ఇచ్చే తీర్పులను ప్రభావితం చేస్తున్నాయి.' అంటూ చేసిన ట్వీట్ మళ్లీ వైరల్ అవుతోంది. దీనిని తాజాగా రీ ట్వీట్ చేసిన కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ ఈ తరహా పోస్టులు న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు ప్రమాదకరంగా మారాయని వ్యాఖ్యానించారు. సిపిఎం నేత, రాజ్యసభ సభ్యుడు ఎఎ రహీమ్ ప్రజాస్వామ్యంపై మచ్చగా నజీర్ నియమాకాన్ని అభివర్ణించారు. నజీర్ ఈ నియమాకాన్ని తిరస్కరించి ఉండవలసిందని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో చేసిన పోస్టులో ఆయన 'జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను గవర్నర్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విలువలకు వ్యతిరేకం. ఇది తీవ్రంగా ఖండించదగిన చర్య. ఆ ఆఫర్‌ను ఆయన తిరస్కరించవలసింది. దేశం న్యాయవ్యవస్థపై నమ్మకం కోల్పోకూడదు. మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ తరహా చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చలుగా మారుతున్నాయి' అని పేర్కొన్నారు.

వ్యతిరేక తీర్పులు ఇస్తే...

కీలకమైన అంశాల్లో ప్రభుత్వానికి వ్యతిరేక తీర్పులు ఇస్తే ఏం జరుగుతుందనడానికి జస్టిస్ అఖిల్ ఖురేషి ఉదంతమే నిదర్శనం. 2010లో గుజరాత్ మాజీ హోంమంత్రి అమిత్ షాను ఖురేషి సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో రిమాండ్‌కు పంపారు. హైకోర్టులో రెండవ సీనియర్ జడ్జిగా ఉన్న ఆయన్ను కొలిజియం సిఫార్సు చేసినప్పటికీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అవకాశం లభించలేదు. అదే సమయంలో బిజెపి మహిళా విభాగానికి ప్రధాన కార్యదర్శిగా ఉండటంతోపాటు, విద్వేష వ్యాఖ్యలు చేసినప్పటికీ తమిళనాడులో లక్ష్మణ చంద్ర విక్టోరియా గౌరి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం విఫలం

- మేకిన్ ఇండియా జోకిన్ ఇండియాగా మారింది
- దేశంలో అడ్డగోలుగా ప్రయివేటీకరణ
- తెలంగాణ సిఎం కెసిఆర్



శాసనసభలో మాట్లాడుతున్న కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విపలమైందని, అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత ప్రధానికి లేదని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. శాసనసభలో ఆదివారం ద్రవ్యవినిమయ బిల్లుపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, బడా వ్యాపారులకు మేలుచేసే విధానాలపై కెసిఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పరిపాలనలో వార్షిక వృద్ధి రేటు 6.8 శాతం ఉంటే బిజెపి హయాంలో 2014-23 వరకు 5.5 శాతానికి పడిపోయిందన్నారు. మోడీ పాలనలో ఏ పాలసీ కూడా విజయవంతం కాలేదని విమర్శించారు. మేకిన్ ఇండియా జోకిన్ ఇండియాగా మారిందని ఎద్దేవా చేశారు. మందబలం ఉంది కాబట్టి.. ఏదిపడితే అటే మాట్లాడుతూ జైలుల్లో వేస్తాం అనటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశానికి ఆర్థిక మంత్రి.. రేషన్ దుకాణంలో మోడీ ఫొటో పెట్టలేదని డీలర్‌తో కొట్లాడుతున్నారని.. ఏం గొప్పదనం సాధించారని మోడీ ఫొటో పెట్టాలి? అని కెసిఆర్ ప్రశ్నించారు. తెలంగాణకు మోడీ తీవ్ర అన్యాయం చేశారని రంగాల వారీగా లెక్కలు చెప్పారు. సరుకు రవాణా చేసే గూడ్స్ రైలు వేగం సగటు చైనాలో గంటకు 120 కిలోమీటర్లు ఉంటే ఇండియాలో 24 కిలోమీటర్లు ఉందన్నారు. ఏ ప్రధానీ రైళ్లను ప్రారంభించలేదు.. ఇప్పటికి 14 సార్లు ప్రధాని వందేభారత్ రైలును ప్రారంభించారని దుయ్యబట్టారు. అప్పులు చేయడంలో మోడీని మించిన ఘనుడు లేడని విమర్శించారు. దేశంలో అడ్డగోలుగా ప్రయివేటీకరణ జరుగుతోందని కెసిఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. గోద్రా వ్యవహారంలో బిబిసి డాక్యుమెంటరీని బ్యాన్ చేశారు. ఇంత అహంకారమా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైళ్లు, విమానాలు, పోర్టులు, రోడ్లు, రైల్వేస్టేషన్లు అమ్మేశారు. ఎల్ఐసిని ఎందుకు ప్రయివేటీకరణ చేశారు.? అని కేంద్రాన్ని నిలదీశారు. సోషలైజేషన్ ఆఫ్ లాసెస్.. ప్రయివేటైజేషన్ ఆఫ్ ప్రాఫిట్ అనే విధానాన్ని మోడీ అనుసరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇది ఏమాత్రం సరికాదన్నారు. మోడీ - రాహుల్ గాంధీ వ్యవహారం 'ఛోటే భాయ్ సుభానల్లా.. బడేబాయ్ మాష అల్లా' అన్నట్లుందని చమత్కరించారు. నువ్వెన్ని ప్రభుత్వాలను కూలగొట్టినవ్ అంటే.. నువ్వు ఎన్ని కూలగొట్టినవ్ అని అనుకుంటున్నారని విమర్శించారు. వీళ్లా దేశానికి కావాల్సింది అని కెసిఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ భావదారిద్ర్యంతో మసకబారుతోందని విమర్శించారు. ప్రధాని మోడీ ఇప్పటికైనా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని కెసిఆర్ హితవు పలికారు.



సోమశేఖర శర్మ వ్యాస సంకలనాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు తదితరులు

భాష - భావాభివృద్ధికి పుస్తకాలు దోహదం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

భాషాభివృద్ధికి, భావాభివృద్ధికి పుస్తకాలు ఎంతగానో దోహదం చేస్తాయని, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన పుస్తక మహోత్సవంలో ఆదివారం సాయంత్రం ప్రముఖ కవి మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాస సంకలనాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ వ్యాసాలను వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో సోమశేఖర శర్మ విశేష కృషి చేశారని, ఆయన పేరుతో విజయవాడ పుస్తక మహోత్సవ్‌లో పుస్తకాలను ఆవిష్కరించడం అభినందనదీయ మని తెలిపారు. పుస్తకాలు చదివే అలవాటు నేడు విద్యార్థుల్లో తక్కువుగా ఉందని,విద్యార్థులు విజ్ఞానంతో పాటు వినోదం, వికాసం కోసం పుస్తకాలు చదవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాస సంకలనాల విశిష్టతను గురించి నేటి యువతరం ఆయన వ్యాసాలను, రచనలను చదవాల్సిన అవసరం ఉందని ప్రముఖ కవి, సాహిత్యవేత్త వాడ్రేవు చినవీరభద్రుడు తెలియచేశారు. ఈకార్యక్రమంలో ఎమెస్కో సంపాదకులు డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

రష్యన్- తెలుగు అనువాద పుస్తక పరిచయ సభ

రష్యన్ - తెలుగు అనువాద సాహిత్యం పుస్తక పరిచయ సభ జరిగింది. కరమజోవ్ సోదరులు,ఆంటోన్ చెకోవ్ పుస్తకాల పరిచయంతో పాటు, పరిచయం చేయడానికి గల కారణాలను పలువురు రచయితలు విశదీకరించారు. ఈకార్యక్రమానికి ప్రదాన వక్తగా వాడ్రేపు చినవీరభద్రుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రష్యన్ - తెలుగు సాహిత్యం విశిష్టత గురించి వివరించారు. ప్రముఖ రచయిత్రి ఉమ నూతక్కి, కథా రచయిత కూనపు రాజ్‌కుమార్, కవి అనిల్ బత్తుల., కాకుమాని శ్రీనివాసరావు, లక్ష్మీ నరసయ్య తదితరులు పుస్తక పరిచయం గురించి తెలియచేశారు.

సాగర్ మిత్ర పురస్కారాలు ప్రదానం

సాహితీ మిత్రులు అరుణ్ సాగర్ పేరుతో సాగర్ మిత్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం పుస్తక మహోత్సవ్‌లోని గొల్లపూడి మారుతీరావు వేదికపై ఆదివారం సాయంత్రం జరిగింది. ఈసందర్భంగా సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి సాగర్ మిత్ర పురస్కారాలను అందచేశారు. ప్రముఖ న్యాయవాది చంగవల్లి సాయిరామ్‌కు స్నేహ పురస్కారం, ప్రముఖ జర్నలిస్టు తులసి చందుకు సాగర్ మిత్ర జర్నలిస్టు పురస్కారం, బెంగళూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి ఝాన్సీ పాపుదేశికి సాగర్ మిత్ర సాహితీ పురస్కారాన్ని అందచేశారు. ఈకార్యక్రమంలో చినుకు రాజగోపాల్, వడ్డమూడి పద్మ, అనిల్ డ్యానీ, శ్రీ శ్రీ విశ్వేశ్వరరావు, కూనపరాజు కుమార్, సంపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించుకోవాలి

- అరసం రాష్ట్ర మహాసభ పిలుపు
- రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరు శివప్రసాద్
- దేశంలో సైలెంట్ ఎమర్జెన్సీ : వినీత్ తివారి



కథాస్రవంతి సంపుటాల ఆవిష్కరణలో అరసం బృందం



రాచపాలెం చంద్రశేఖరరెడ్డి



వల్లూరు శివప్రసాద్

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

సాహితీ సంస్థలు సంఘటితమై భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించాలని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర మహాసభ పిలుపునిచ్చింది. గుంటూరు జిల్లా తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు జరిగిన మహాసభ ఆదివారం ముగిసింది. నూతన కమిటీని ఎన్నుకోవడంతో పాటు పలు తీర్మానాలను ఆమోదించారు. అభ్యుదయ సాహితీవేత్త ముత్యాల ప్రసాద్ సాహిత్య వేదికపై కె.శరత్‌శ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షతన చివరి రోజు నిర్వహించిన సభలో 'ప్రగతిశీల సాహిత్య సాంస్కృతిక శక్తులపై దాడులు - కర్తవ్యాలు' అంశపై అరసం అఖిల భారత కార్యదర్శి వినీత్ తివారి మాట్లాడుతూ దేశంలో సైలెంట్ ఎమర్జెన్సీ కొనసాగుతోందని, దీనిని ప్రతిఘటించడంలో రచయితలు కీలక పాత్ర వహించాలని అన్నారు. సమాజంలో మార్పు కోసం, అభ్యుదయ భావాలతో ప్రజాచైతన్యం కోసం చేస్తోన్న రచనలు ప్రభుత్వాలకు కంటగింపుగా మారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పాలకులు అణచివేత ధోరణిని అవలంభిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో రచయితలకు, సాహితీవేత్తలకు, పాత్రికేయులకు స్వాతంత్ర్యం లేదన్నారు. కాకినాడకు చెందిన పోలాని సోమరాజు రచించిన మనో ప్రస్థానం సంకలనాన్ని, పట్టణానికి చెందిన ఉపాధ్యాయిని అస్మతున్నీసా రచించిన 'అనంతాకాశంలో' మానవ సంబంధాల కవితా మాలిక, 'ఆస్మదీయం' మానవీయ కవితా మాలిక తదితర సంకలనాలను వనీత్ తివారి, కథా స్రవంతి ఆవిష్కరణ సభ సంపాదకులు వల్లూరు శివప్రసాద్, జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం ప్రతినిధులు ఆవిష్కరించారు.

పలు తీర్మానాలు ఆమోదం

సాహితీ సంస్థలు సంఘటితమై భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించాలని, ఆంధ్ర రచయితల సంఘం ఐక్యవేదిక నిర్మించాలని, అనువాద అకాడమీని ఏర్పాటు చేసి నిధులు కేటాయించి పర్యవేక్షణకు అనుభవజ్ఞులను నియమించాలని, గ్రంథాలయ శాఖను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టే క్రమంలో తెలుగు మాధ్యమం కూడా కొనసాగించాలని, మూఢనమ్మకాల నిర్మూలనకు చట్టం చేయాలని, జానపద కళలను, లిపిలేని భాషల పరిరక్షించాలని, నేటి సమాజంలో సామాజిక మాధ్యమాల పాత్ర, దానిపై ప్రభుత్వ నియంత్రణలపై మహాసభ తీర్మానాలు చేసింది.

అరసం నూతన కమిటీ ఎన్నిక

అరసం గౌరవాధ్యక్షులుగా డాక్టర్ పి.సంజీవమ్మ (కడప), అధ్యక్షులుగా రాచపాలెం చంద్రశేఖరరెడ్డి (అనంతపురం), ప్రధాన కార్యదర్శిగా వల్లూరు శివప్రసాద్ (గుంటూరు) ఎన్నికయ్యారు. అధ్యక్షవర్గంగా డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి (కడప), ప్రొఫెసర్ ఎన్.ఈశ్వరరెడ్డి (యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప), సాయిమాధవ్ బుర్రా (తెనాలి), ప్రొఫెసర్ కిన్నెర శ్రీదేవి (ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం), నల్లి ధర్మారావు (శ్రీకాకుళం), కార్యనిర్వాహక కార్యదర్శిగా జిఎస్ చలం (విజయనగరం), కార్యదర్శివర్గంగా కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ (పల్నాడు), బిఎన్ సాగర్ (ఏలూరు జిల్లా), కలం ప్రహ్లాద (కర్నూలు జిల్లా), ఉప్పల అప్పలరాజు (విశాఖ జిల్లా), గంటా మోహన్ (చిత్తూరు జిల్లా), సామాజిక మాధ్యమాల నిర్వహణ యువశ్రీ మురళి (తిరుపలి జిల్లా), కార్యవర్గంగా డాక్టర్ మాచిరెడ్డి (కడప), చెరుకుమల్లి సింగారావు (తెనాలి), డాక్టర్ పెరుగు రామకృష్ణ (నెల్లూరు జిల్లా), డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర (అనంతపురం జిల్లా), డాక్టర్ తుమ్మలూరి సురేష్‌బాబు, గంగా సురేష్‌బాబు (కడప జిల్లా), డాక్టర్ నెమిలేటి కిట్టన్న (తిరుపతి జిల్లా), పల్లిపట్టు నాగరాజు (చిత్తూరు జిల్లా), కొత్తపల్లి సత్యనారాయణ (కర్నూలు జిల్లా), చింతా కృష్ణారావు (శ్రీకాకుళం జిల్లా), ఆర్.బాలకృష్ణ (విజయనగరం జిల్లా), మల్లిపురం జగదీష్ (పార్వతీపురం జిల్లా), మల్లుల సీతారాంప్రసాద్ (పశ్చిమగోదావరి జిల్లా), చలసాని వెంకటరామారావు, ఎస్.ఆకాష్ (ఏలూరు జిల్లా), కొండపల్లి మాధవరావు, పరుచూరి అజయ్, కొప్పర్తి రాంబాబు, మోదుకూరి అరుణ్‌కుమార్ (ఎన్‌టిఆర్ జిల్లా), పడాల వీరభద్రరావు (రాజమండ్రి జిల్లా), కోసూరి రవికుమార్ (పల్నాడు జిల్లా), గోలి సీతారామయ్య (గుంటూరు జిల్లా), మంచికంటి వెంకటేశ్వరరావు (ప్రకాశం జిల్లా), ఎస్ వెంకటసుబ్బయ్య (కార్మిక సంఘం), ముర్తుజా ఎస్ (నంద్యాల జిల్లా), జి.ఓబులేసు (ఎఐటియుసి), చిన్నం పెంచలయ్య (ఎపి ప్రజానాట్యమండలి), కూన అజయ్‌బాబు (విశాలాంధ్ర దినపత్రిక)ను ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రకటించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

గిట్టుబాటు ధరల కోసం మరోసారి దేశవ్యాప్త ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ రైతుల ఉద్యమ స్ఫూర్తి హిమచల్ ప్రదేశ్‌లో మోడికి వాతపెట్టిందని అన్నారు. ఆపిల్ రైతులు మోడీకి వ్యతిరేకంగా మారడంతో అక్కడ బిజెపి ఓడిపోయిందన్నారు. దేశ జిడిపిలో లక్షకోట్ల వాటా వ్యవసాయరంగానిదని ఆ మొత్తాని అదానికి కట్టబెట్టేందుకు మోడి ప్రయత్నిస్తున్నారని అన్నారు. అదాని, అంబానీలకు మోడి ఎంత ముఖ్యమో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా అంతే ముఖ్యమని అన్నారు. యూరియా సబ్సిడీని ఎత్తివేయడం, ఆహారభద్రతకు కేటాయింపుల్లో రూ90వేల కోట్లను తగ్గించడం లాంటి చర్యలు రైతు వ్యతిరేక విధానాలేనని అన్నారు రాష్ట్రంలోని ప్రధాన ఓడరేవులను చేజిక్కించుకున్న అదాని విశాఖ స్టీల్‌ను స్వాదీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి నోరుమెదపక పోవడం తగదని అన్నారు ప్రముఖనటుడు ఆర్ నారాయణమూర్తి మాట్లాడుతూ దేశంలో విద్యవైద్య రంగాలతోపాటు విమానాశ్రయాలు, ఓడరేవులు, ప్రధానమైన రోడ్లను చేజిక్కించుకున్న అదాని వ్యవసాయరంగాన్ని కూడా తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు చేస్తున్న యత్నాలకు మోడి పూర్తి సహకారం ఇస్తున్నారని విమర్శించారు. దేశంలో మోడి కాకుండా అదానిపాలన సాగుతోందని విమర్శించారు. ఎపి రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మధు మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ పోరాటం చారిత్రాత్మకమైందని ఆదే స్ఫూర్తితో వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని కోరారు. ఈ సదస్సులో ఉత్తర ప్రదేశ్ రైతు సంఘనాయకుల రాజ్‌వీర్ సింగ్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డేశోభానాద్రీశ్వరావు రాసిన కార్పొరేట్లకు తప్ప సామాన్యులకు మేలు చేయని మోడీ పాలన అన్న బుక్‌లెట్‌ను జస్టిస్ గోపాలగౌడ అవిష్కరించారు.

దేశవ్యాప్తంగా బిసి జనగణన

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడానికి అప్పటి ప్రధాని విపి సింగ్ తన పదవిని వదులుకున్నారని గుర్తు చేశారు. కులగణన జరిగితే బిసిలతోపాటు ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రయోజనం ఉంటుందని, సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. బిపి మండల్ మనవడు సూరజ్ మండల్ మాట్లాడుతూ బిసి గణన చేపట్టేందుకు గుంటూరు నుంచే డిక్లరేషన్ ప్రారంభం కావాలని ఆకాక్షించారు. రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ, విడదల రజనీ, కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్ మాట్లాడుతూ బిసి జనగణనకు సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రం బిసి గణన చేపట్టే వరకు ఐక్యపోరాటం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఒబిసి విభాగం చైర్మన్ కెప్టెన్ అజిత్ సింగ్, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, విగ్రహావిష్కరణ కమిటీ కన్వీనర్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కో-కన్వీనర్ ఆలా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జస్టిస్ ఈశ్వరయ్య, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, ఎమ్మెల్సీలు ఎల్.అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొన్నారు

నిత్య పెళ్లి కొడుకు 'హాఫీజ్ పాషా'!

- భూతవైద్యం పేరుతో భయపెట్టి ఏడు పెళ్లిళ్లు
- ఎనిమిదో పెళ్లికి సిద్ధమైన నెల్లూరుకు చెందిన దొంగ బాబా గుట్టురట్టు

ప్రజాశక్తి- నెల్లూరు, హైదరాబాద్ ప్రతినిధులు

మహిళల ఆర్థిక పరిస్థితి, అనారోగ్యం, అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని భూతవైద్యం పేరుతో ఓ దొంగబాబా ఏకంగా ఏడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. 8వ పెళ్లికీ సిద్ధమయ్యాడు. ముహూర్త సమయానికి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరడంతో పెళ్లి ఆగిపోయింది. వధువు బంధువులకు అనుమానం వచ్చి ఆరా తీయగా దొంగ బాబా బండారం బైటపడింది. హైదరాబాద్‌లోని లంగర్‌హౌజ్ సిఐ శ్రీనివాస్, బాధిత యువతి తండ్రి ఆదివారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం... టోలిచౌకికి చెందిన 18 ఏళ్ల యువతి మూడేళ్లుగా ఎపిలోని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎఎస్‌పేట మండలంలోని ప్రసిద్ధ 'హజరత్ బాబా నాయబ్ రసూల్' దర్గా పీఠాధిపతి హాఫీజ్ పాషా (బాబా) (54) వద్ద చికిత్స తీసుకుంటోంది. కొద్ది రోజుల్లోనే ఆ యువతి చనిపోతుందని కుటుంబ సభ్యులను బాబా భయపెట్టాడు. తాను పెళ్లి చేసుకుని బతికించుకుంటానని నమ్మబలికాడు. యువతి, కుటుంబసభ్యులూ ఒప్పుకోవడంతో టోలిచౌకి ఫంక్షన్ హాలులో గత శనివారం రాత్రి 11 గంటలకు పెళ్లికి ఏర్పాట్లు చేశారు. అనుకున్న సమయానికి బాబా రాలేదు. బాబా అనుచరులు వచ్చి బాబాకు గుండెపోటు వచ్చిందని, పెళ్లి వాయిదా వేసుకోవాలని చెప్పారు. వధువు బంధువులు అనుమానంతో లంగర్ హౌజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ బాబాకు ఇదివరకే ఏడు పెళ్లిళ్లు అయినట్టు సమాచారం. హాఫీజ్ పాషా ఎన్నో సంవత్సరాల నుంచి బాబాగా కొనసాగుతున్నారు. ఈ దర్గాకు ఇతర రాష్ట్రాల నుంచీ భక్తులు వస్తుంటారు. ఇటీవల తన పీఠాధిపతి పదవిని తన కుమారుడికి అప్పగించి ఇతర ప్రాంతాలకు ఆయన వెళ్తున్నారు. ఆయనపై పోలీస్ స్టేషన్లో గతంలో నమోదైన కేసులను పరిశీలిస్తే... చెన్నయ్‌కి చెందిన ఓ మహిళను వివాహం చేసుకొని వదిలేశారు. ఆమె ఎఎస్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. మరో మహిళ మరియమ్మ వద్ద సుమారు రూ.50 లక్షల వసూలు చేశారు. ఆమె అదే పోలీసు స్టేషన్లో కేసు పెట్టారు. డబ్బులు అడిగితే ఆమె ఇంట్లో గంజాయి పెట్టి అక్రమ కేసు పెట్టించినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఈ కేసు నడుస్తోంది. ఈ బాబా కడపకు చెందిన డిప్యూటీ సిఎం అంజద్ బాషాకు అత్యంత సన్నిహితుడని సమాచారం. ఈ విషయంపై నెల్లూరు జిల్లా పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు.

ఎయిర్‌పోర్టు నిర్వాసితులు చెల్లాచెదురు

(మొదటి పేజీ తరువాయి)

కొండపు రమేష్ చదువు కోసం తల్లిదండ్రులు వేరొక ఊరు వెళ్లారు. గ్రామంలో సొంత ఇల్లు, పొలం కూడా ఉంది. వాటికి ప్రభుత్వం నష్టపరిహారం కూడా ఇచ్చింది. జాబితా తయారీ సమయంలో గ్రామంలో లేరన్న నెపంతో ఆర్‌అండ్‌ఆర్ వర్తింపజేయలేదు. కొండపు కొండమ్మ, బైరెడ్డి అసిరమ్మ, బూస నరసమ్మ సహా ఈ గ్రామంలో 11 కుటుంబాలు ఇదే సమస్యతో సతమతమవుతున్నాయి.

18 ఏళ్లు దాటిన వారికి ప్యాకేజీ ఏదీ?

ఆర్ అండ్ ఆర్ చట్టం ప్రకారం గ్రామాలు ఖాళీ చేయించిన నాటికి 18 ఏళ్లు దాటిన వారికి కూడా ఐదు సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.9.50 లక్షల చొప్పున ఇస్తామని 2015లో ప్రభుత్వ యంత్రాంగం హామీ ఇచ్చింది. ఆచరణలో అప్పట్లో గుర్తించిన 18 ఏళ్లు పైబడిన యువతకు మాత్రమే ప్యాకేజీ అమలు చేసింది. దీంతో, ఒక్క మరడపాలెంలోనే సుమారు 20 మంది యువతీ, యువకులు ఆర్‌అండ్‌ఆర్‌కు నోచుకోలేదు. తనకు 2015 నాటికే 18 ఏళ్లు దాటాయని, ప్యాకేజీ గురించి అడిగితే అధికారులు స్పందించడం లేదని మరడపాలేనికి చెందిన కొండపు నర్సింగరావు 'ప్రజాశక్తి' ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కొండపు రమణ సహా 18 ఏళ్ల నిండిన చాలామంది యువతీ, యువకులు గ్రామంలో ఉన్నారు.

ప్యాకేజీ పొందిన వారిది మరో సమస్య

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పొందినవారూ అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఒప్పందం కుదిరిన ఆరేళ్ల తరువాత అంటే 2021లో ప్రభుత్వం డబ్బులు విడుదల చేసింది. ఈలోపు నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో ఇంటి నిర్మాణ వ్యయం పెరిగింది. దీంతో, వివిధ స్థాయిల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. లింగాలవలస పునరావాస కాలనీలో మరడపాలేనికి చెందిన 70 ఇళ్ల నిర్మాణాన్ని స్థానిక వైసిపి నాయకుడు కాంట్రాక్టు తీసుకున్నారు. తొలుత కుదిరిన ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వలేదనే పేరుతో నిర్మాణాలను మధ్యలో ఆయన విడిచిపెట్టారు. దీంతో, వీరంతా ఉన్న పళంగా ఆయా ఇళ్లల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

అందరికీ న్యాయం చేస్తాం



ఎయిర్‌పోర్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం. ఒక్క మరడపాలెంలోనే కొన్ని సమస్యలున్నాయి. అప్పట్లో పేర్లు నమోదు కాకపోవడం వల్ల 11 కుటుంబాల వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందలేదు. వీరివద్ద స్థానిక చిరునామాతో కూడిన కార్డులు ఉండడం వల్ల మిగిలినవారి మాదిరిగానే ఐదు సెంట్లు స్థలం, రూ.9.50 లక్షల చొప్పున ప్రభుత్వం తరుపున మంజూరు చేస్తాం. స్థానికంగా ఉంటున్నట్టు గుర్తింపు లేకపోవడం వల్ల 31 మంది వలస కూలీ కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ వర్తింపజేయలేం. వారికి 1.50 సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తాం. నోటిఫైడ్ చేసిన తరువాత 18 ఏళ్లు నిండినవారికి మాత్రం ఇప్పుడు ప్యాకేజీ మంజూరుకు అవకాశం లేదు. **-ఎంవి. సూర్యకళ, ఆర్‌డిఒ**

బతుకు తెరువు కోసం వెళ్తే బతుకే లేకుండా చేస్తారా?



బతుకు తెరువు కోసం వలసపోతే ఏకంగా బతుకే లేకుండా చేస్తారా? వలసపోయిన వారి భూములు వద్దని ఆ రోజుల్లో ప్రభుత్వం ఎందుకు చెప్పలేదు. అలా అంటే ఇళ్లు, భూములు వదులుకునే వాళ్లం కాదు. పుట్టడం, పెరగడం అన్నీ ఇక్కడే. ఇక్కడ కూలి కూడా దొరక్క విజయవాడ వెళ్లి వస్తున్నాం. పండగలు, పెళ్లిళ్లు కూడా ఇక్కడే. ప్యాకేజీ అడిగితే అధికారులుగానీ, నాయకులుగానీ పలకడం లేదు.

-కొయ్యి రాము, మరడపాలెం



ఫిబ్రవరిలో 17,400 మంది ఉద్యోగుల తొలగింపు!

న్యూఢిల్లీ : టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతూనే ఉన్నాయి. 2023లో ఇప్పటి వరకు లక్షకు పైగా ఉద్యోగులను తొలగించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ నెలలో ఇప్పటివరకు దాదాపు 17,400 మంది ఉద్యోగాలు పోయాయి. రానున్న రోజుల్లో ఇంకా చాలామంది ఇంటి బాట పట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2023లో ఇప్పటి వరకు 340 కంపెనీలు 1.10 లక్షల మంది ఉద్యోగులను తొలగించాయని లేఆఫ్.ఎఫ్‌వైఐ వెబ్‌సైట్ తెలిపింది. ఈ నెలలో ఉద్యోగులను తొలగించిన కంపెనీల్లో యాహూ, బైజూస్, గోడ్యాడీ, గిట్‌హబ్, ఇబే, ఆటోడెస్క్, ఓఎల్ఎక్స్ గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. జనవరిలో లక్షలకు పైగా ఉద్యోగాలు పోయాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, సేల్స్ వంటి ప్రముఖ కంపెనీలు గత నెల అనేకమంది ఉద్యోగులను సాగనంపాయి. జనవరిలో రోజుకు సగటున 3,300 మంది ఉద్యోగాలు కోల్పోవడం గమనార్హం. ఆర్థిక మాంద్యం భయాలు రోజురోజుకీ బలపడుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లోనూ తొలగింపులు కొనసాగనున్నాయి. 2022లో దాదాపు 1.54 లక్షల మందికిపైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఇప్పటి వరకు టెక్ ఇండస్ట్రీలో 2.5 లక్షల మందిని తొలగించారు.

ప్రత్యామ్నాయ విద్యావిధానం రావాలి

బాలోత్సవంలో విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య



చిన్నారుల నృత్య ప్రదర్శన



సభలో మాట్లాడుతున్న లావు రత్తయ్య

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులకు అనుభవపూర్వకమైన ప్రత్యామ్నాయ విద్యను అందించాలని విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య సూచించారు. బట్టీ చదువుల వల్ల ఏదో ఒక స్థాయిలో విద్యార్థి అభివృద్ధి ఆగిపోతుందన్నారు. గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో రెండ్రోజులపాటు నిర్వహించిన గుంటూరు బాలోత్సవం ఆదివారం ముగిసింది. వేలాది మంది విద్యార్థులు వివిధ అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. రెండోరోజు కార్యక్రమాన్ని విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బాలోత్సవం అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో రత్తయ్య మాట్లాడారు. పుస్తకాల్లో ఉన్న సమాచారాన్ని ఉపాధ్యాయులు బోధించారని, టెక్నాలజీ అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఆ సమాచారాన్ని విద్యార్థి ఎలాగైనా పొందగలరని, ప్రతి అంశాన్నీ ప్రాజెక్ట్ రూపంలో బోధించటం వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. ఈ క్రమంలో బాలోత్సవం ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని ప్రోత్సహించేదిగా ఉందన్నారు. లక్ష్మణరావు మాట్లాడుతూ..రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, పట్టణాల్లో బాలోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులో సృజనాత్మకతను, ఆలోచనను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, ఆంధ్రా క్రైస్తవ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోజెస్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెవివి జాతీయ నాయకులు కె శ్రీనివాస్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, రిటైర్ అగ్రికల్చర్ సైంటిస్ట్ ఎన్.వేణుగోపాలరావు, బాలోత్సవం కన్వీనర్లు ఎం.బోసుబాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అవును.. అప్పర్ భద్రకు బడ్జెట్ మాత్రమే కేటాయించాం

- కేంద్ర మంత్రి దేవాసిన్హ్ చౌహాన్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

అప్పర్ భద్ర ప్రాజెక్ట్ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించామని కేంద్ర ఐటి శాఖ మంత్రి దేవాసిన్హా చౌహాన్ తెలిపారు. ఆదివారం ఆయన కర్నూలులో పర్యటించారు. ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అప్పర్ భద్ర పనులు నిలిపివేయాలంటూ రాష్ట్రంలో జరుగుతున్న నిరసనలపై స్పందించారు. ఈ పనులు చాలా ఏళ్లుగా జరుగుతున్నాయని, ఇప్పుడు కేంద్ర నిధులు మాత్రమే కేటాయించామని తెలిపారు. ఎపికి కేంద్ర బడ్జెట్‌లో 42 వేల కోట్లు కేటాయించామన్నారు. ఎయిమ్స్ కోసం రూ. ఆరు వేల కోట్లు కేటాయించామని, కర్నూలులో డిఆర్‌డిఒ కోసం రూ.మూడు వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. కృష్ణానదిపై కడుతున్న ఐకానిక్ వంతెన బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజి నిర్మించాలని సొంత పార్టీ నేతల ఉద్యమాలపై స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించిన తరువాతనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని బదులిచ్చారు. సమావేశంలో మాజీ రాజ్య సభ సభ్యులు టిజి వెంకటేష్, బిజెపి జిల్లా అధ్యక్షులు పోలంకి రామస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి, ఒబిసి మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

- సర్వదర్శనానికి 25 గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. టిబిసి వరకూ భక్తులు క్యూ లైన్‌లో వేచి ఉన్నారని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు 25గంటలు, మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం వారికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. శనివారం 75,728 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం ఒక్కరోజు శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.15 కోట్ల రూపాయలు వచ్చిందని టిటిడి అధికారులు వెల్లడించారు.

సీనియర్ సినీ రచయిత యడవల్లి మృతి



విజయవాడ : సినీ రచయిత, సెన్సార్ బోర్డ్ మెంబర్ యడవల్లి వెంకట లక్ష్మి నరసింహశాస్త్రి అనారోగ్య కారణాలతో శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. నెల్లూరులో జన్మించిన యడవల్లి విజయవాడలో స్థిరపడ్డారు. ఆదివారం ఉదయం విజయవాడలో యడవల్లి అంత్యక్రియలు ముగిశాయి. ఆయన మరణవార్త విన్న సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. చిత్రసీమలో యడవల్లిగా పేరుగాంచారు. పలు తెలుగు, కన్నడ, తమిళ చిత్రాలకు రచనలు చేశారాయన. విజయవాడలో సినీ నిర్మాత రాధాకృష్ణమూర్తి ద్వారా చిత్రసీమలోకి అడుగు పెట్టారు. యడవల్లి ప్రస్తుతం కేంద్ర సెన్సార్ బోర్డ్ (సిబిఎఫ్‌సి) సభ్యునిగా సేవలందిస్తున్నారు.

ఆహారం కలుషితంపై విచారణ జరిపించాలి

- పోలవరం కార్మికులకు సిఐటియు నేతల పరామర్శ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో కలుషిత ఆహారం వల్ల కార్మికులు అస్వస్థతకు గురైన ఘటనపై విచారణ జరిపించాలని సిఐటియు డిమాండ్ చేసింది. బాధిత కార్మికులను సిఐటియు నేతలు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి లక్షణాలతో పోలవరం ప్రాజెక్టులో పనులు చేస్తున్న 150 మంది కార్మికులు అస్వస్థతకు గురి కావడం విచారకరమన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నాణ్యమైన ఆహారం ఇవ్వకుండా నాసిరకం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, పౌష్టికాహారం అదించాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు జీతాలివ్వలేని దుస్థితిలో వైసిపి పాలన : జివిఎల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలివ్వలేని దుస్థితిలో వైసిపి పాలన కొనసాగుతోందని బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు పేర్కొన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే ప్రాజెక్టులకు డబ్బులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందన్నారు. జగన్‌కు రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజావ్యతిరేకతను కేంద్రంపై నెట్టేద్దామని చూస్తున్నారని, వైసిపి ఎంపిలు అబద్ధాలు మాట్లాడుతూ వారి చేతకానితనం బయటపెట్టుకున్నారని తెలిపారు. విశాఖతో సహా అనేక పారిశ్రామిక వాడల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. 2018లో టిడిపి ఎంపిలు ఏం మాట్లాడారో నేడు వైసిపి ఎంపిలు కూడా అదే క్యాసెట్‌ను వినిపిస్తున్నారని అన్నారు. కాపులను టిడిపి, వైసిపి మోసం చేశాయన్నారు. లోకేష్ పాదయాత్రతో టిడిపి గ్రాఫ్ మళ్లీ పడిపోతోందని, పాదయాత్రకు ఎటువంటి అడ్డంకులూ కల్పించవద్దని వైసిపి ప్రభుత్వానికి జివిఎల్ సూచించారు.

పెన్నాలో ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) (కడప జిల్లా)

పెన్నానదిలో ఈతకెళ్లి ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన పోయిలమేన సుధాకర్ (19), విజయ్‌కుమార్ (18)లిద్దరూ ఈతకోసం సోములవారిపల్లె పంచాయతీలోని థర్మల్‌రోడ్డు సమీపంలోని పెన్నానదికి వెళ్లారు. ఈత ఆడుతుండగా ఒక్కసారిగా ఇద్దరూ ఊబిలోకి కూరుకుపోయారు. అటుగా వెళ్తున్న వారు గమనించి వారిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలతో దేశాభివృద్ధి

జన విజ్ఞాన వేదిక జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశకి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

శాస్త్ర, సాంకేతిక రంగాలకు ఏ దేశం అధిక ప్రాధాన్యతనిస్తుందో ఆ దేశమే దేశాభివృద్ధిలోనూ ముందుంటుందని పలు రాష్ట్రాలకు చెందిన విజ్ఞాన శాస్త్ర మేధావులు పేర్కొన్నారు. విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక (జెవివి) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన 'ఖగోళ శాస్త్రం - మానవ వికాసంపై దాని ప్రభావం' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరిగింది. జెవివి నాయకులు, విశాఖ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ఇస్రో (బెంగళూరు) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి రెమెళ్ల మాట్లాడారు. ఇస్రో సాధించిన విజయాలను, రాకెట్ టెక్నాలజీని వివరించారు. అంతరిక్ష శాస్త్ర, సాంకేతిక రంగాల ఫలితాలు ఎలా ఉండబోతాయో తెలిపారు. కమ్యూనికేషన్ వ్యవస్థలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. గగన్‌యాన్ లక్ష్యాలను తెలియజేశారు. ఐఐటి చెన్నయ్ ప్రొఫెసర్ డాక్టర్ వి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ప్రాచీన కాలం నుంచీ ఖగోళ శాస్త్రంపై అత్రి మహర్షి, ఆర్యభట్టు, వరహా మిహిరుడు, బ్రహ్మ గుప్తుడు పరిశీలనలను తెలియజేశారని, ఈజిప్టు, చైనా, అరేబియా, మయాన్, పాలీనేషియాల్లో ఖగోళ శాస్త్రంపై చాలా ఏళ్ల కిందటే పరిశోధనలు జరిగాయని తెలిపారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఎ రామచంద్రయ్య మాట్లాడుతూ సైన్సు భౌతికవాదమని, రుజువులకు, నిరూపణకు నిలబడని అంశాలు భావవాదం కిందకు వస్తాయని తెలిపారు. ప్రముఖ హేతువాది పెనుమత్స సుబ్బరాజు మాట్లాడుతూ ప్రపంచ దేశాల మతాలలో ఖగోళ శాస్త్రంపై అపోహలు, అబద్ధాలు ఎలా ఉన్నాయో వివరించారు. మతాలను నిలదీసిన ప్రతి ఒక్కరినీ ఛాందసవాదులు పొట్టనబెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక ముందుగా ఇచ్చిన ఆన్‌లైన్ లింకులో వందలాది మంది టీచర్లు, అధ్యాపకులు, స్కాలర్లు, ఉద్యోగులు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ జాతీయ సదస్సులో పాల్గొని కొత్త విషయాలు తెలుసుకున్నారు. సదస్సులో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాలరావు, రాధారాణి, కెఎంఎంఆర్ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు శుభకర్, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీకాంత్, కోశాధికారి ఎస్‌వి రమణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి రెమెళ్ల

రక్త చరిత్రకు సమాధానం చెప్పాలి

- టిడిపి బహిరంగ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివేకానందరెడ్డి హత్యకేసులో ఎన్నికలకు ముందు తమపై మోపిన తప్పుడు ప్రచారానికి అన్ని ఆధారాలతో సమాధానం చెబుతామని, జగనాసుర రక్త చరిత్రలో వస్తున్న అనుమానాలను నివృత్తి చేసుకునే ధైర్యం జగన్‌మోహన్‌రెడ్డికి, తాడేపల్లి ప్యాలెస్‌కు ఉందా? అని టిడిపి ప్రశ్నించింది. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌కు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బి టెక్ రవి, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి, కర్నూలు టిడిపి అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. వివేకానందరెడ్డి హత్యలో తన పాత్ర లేకుంటే హత్య ఆనవాళ్లను అవినాష్‌రెడ్డి ఎందుకు ధ్వంసం చేయించారని ప్రశ్నించారు. రక్తపు వాంతులకు, దారుణహత్యకు తేడా తెలియనంత అమాయకుడా ఎంపి అవినాష్‌రెడ్డి అని నిలదీశారు. హత్యలు, స్కామ్ చేసి వాటిని ఎదుటివారిపైకి నెట్టేయడం జగన్‌మోహన్‌రెడ్డి నైజమని, తాడేపల్లి ప్యాలెస్‌పై వస్తున్న ఆరోపణలకు జగన్ దంపతులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వివేకానందరెడ్డి హత్యకు దారి తీసిన పరిస్థితులేమిటి, హత్యకు పథక రచన చేసిందెవరు, హత్యలో ఎవరెవరు పాల్గొన్నారు, ఎలా హత్య చేశారు అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కారులోనుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసులు

శ్రీవారి దర్శనం కోసం వస్తూ..

- కారును లారీ ఢీకొనడంతో తెలంగాణకు చెందిన ఇద్దరు మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట (కడప)

కడప జిల్లా ఒంటిమిట్టలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు. పోలీసుల వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా గూత్‌పూర్ మండలం అమీషార్ గ్రామంలో ఒకే కుటుంబానికి ఏడుగురు శ్రీవారి దర్శనం కోసం శనివారం తిరుమలకు కారులో బయలు దేరారు. ఆదివారం ఉదయం ఒంటిమిట్ట మండల పరిధిలోని మంగంపేట ఇరుకురాళ్లబోట్టు మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును చెన్నై నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. కారు రెండు పల్టీలు కొట్టడంతో అందులోని వారు చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ప్రమాదంలో వంశీకృష్ణ (24), సురేష్ (24) అక్కడికక్కడే మరణించారు. హనుమంతు, కృష్ణవేణి, బిందేశ్వరి, రాము, వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను, మృతదేహాలను కడప రిమ్స్‌కు తరలించారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ పాలనలో సంక్షోభం

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్



మహిళలతో సెల్ఫీ తీసుకుంటున్న లోకేష్

ప్రజాశక్తి- కార్వేటినగరం (చిత్తూరు)

జగన్ అరాచకపాలనలో అన్నిరంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం కొత్తూరు నుంచి పాదయాత్ర ప్రారంభమైంది.

ఈడిగపల్లెలో గౌడ సామాజిక తరగతికి చెందిన వారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని తెలిపారు. సభల్లో మాట్లాడకుండా ఉండేందుకు మైకు ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం అడ్డుకుంటుందని విమర్శించారు. అమర రాజా ఫ్యాక్టరీ ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే అటువంటి సంస్థను తెలంగాణకు తరిమికొట్టిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో టిటిడి చైర్మన్‌గా యాదవ సామాజిక తరగతికి చెందిన వారిని నియమించామని తెలిపారు. పాదయాత్ర దారి మధ్యలో ఓ ఆటో డ్రైవర్‌తో లోకేష్ మాట్లాడారు. 'ఎపిలో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉండడంతో తమిళనాడులో కొంటున్నామని డ్రైవర్ శివకుమార్ తెలిపారు. వచ్చేది మన ప్రభుత్వమే... పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గిస్తామని లోకేష్ భరోసానిచ్చారు. యాత్ర గొల్లకండ్రిక మీదుగా ద్వారకానగర్‌కు చేరుకుంది. సోమవారం నగరి నుంచి యాత్ర ప్రారంభం కానుంది. శనివారం రాత్రి లోకేష్ సతీమణి బ్రాహ్మణి, కొడుకు దేవాన్ష్ కొత్తూరుకు చేరుకున్నారు. లోకేష్‌ను పరామర్శించిన అనంతరం వారు హైదరాబాద్‌కు చేరుకున్నారు.

వైసిపి పాలనలో కాపులకు అన్యాయం : అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో కాపులకు జరిగిన అన్యాయం ఏ ప్రభుత్వంలో జరగలేదని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఆర్థికంగా, రాజకీయంగా అణచివేసి కాపుల కళ్లు పొడిచారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారంలోకి రాగానే కాపుల అభ్యున్నతి కోసం టిడిపి కల్పించిన ఐదు శాతం రిజర్వేషన్‌ను ఎత్తివేసి రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నామంటూ అబద్ధాలు చెబుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. టిడిపి హయాంలో కాపు కార్పొరేషన్ ద్వారా రూ.3,100 కోట్ల నిధులు కాపుల సంక్షేమం కోసం ఖర్చు చేశారని తెలిపారు. రుణాలకు చేసుకున్న దరఖాస్తులను కూడా జగన్ రద్దు చేశారని ఆరోపించారు. ఎన్‌టిఆర్ విదేశీ విద్యాదరణ పథకం ద్వారా 4,528 మంది విద్యార్థులకు లబ్ధి జరిగిందని, ఎన్‌టిఆర్ ఉన్నత విద్యా పథకం ద్వారా 1,413 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చామని పేర్కొన్నారు. కాపు నేతల్ని జగన్ అక్రమ కేసులతో వేధిస్తున్నారని విమర్శించారు. టిడిపి నిర్మించిన కాపు భవనాలను నిర్వీరం చేసి ఊరికొక ప్యాలెస్ కట్టుకుంటున్నారని పేర్కొన్నారు.

యాంత్రీకరణ బిల్లులు పెండింగ్

- హైకోర్టుకెక్కుతున్న సప్లై సంస్థలు
- ఈ ఏడాది ఇంకా మొదలు కాని స్కీం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు యంత్ర పరికరాలు సరఫరా చేసిన సంస్థలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా బకాయి పెట్టింది. దాదాపు రూ.50 కోట్లకుపైన చెల్లింపులు నిలిచిపోయాయని తెలుస్తోంది. ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్ల వంటి ఒక మోస్తరు పెద్ద యంత్రాలు మొదలుకొని స్ప్రేయర్ల వంటి చిన్న చిన్న పరికరాల వరకు ప్రభుత్వ భరోసాపై కంపెనీలు రైతులకు సరఫరా చేశాయి.

చిన్న పరికరాలు సరఫరా చేసినవన్నీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఇ) సంస్థలే. గతేడాది సరఫరా చేసిన బిల్లులు నేటికీ చెల్లించకపోవడంతో పలు కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. కొన్ని కేసుల్లో బిల్లులు చెల్లించాలని ఆదేశిస్తూ న్యాయస్థానం ఆదేశాలు సైతం ఇచ్చింది. రూ.5 లక్షలు, పది లక్షల వంటి చిన్న చిన్న అమౌంట్ల కోసం హైకోర్టుకు వెళ్లాల్సి వస్తోందని సంస్థలు చెబుతున్నాయి. బిల్లులు అడిగితే కోర్టులో కేసులు వేసుకుంటేనే ప్రభుత్వం విడుదల చేస్తుందంటూ అధికారులే సూచిస్తున్నారని, గత్యంతరం లేకనే లీగల్ ఖర్చులు భరించి కోర్టుల్లో కేసులు వేయాల్సి వస్తోందని వాపోతున్నారు.



మూడవ ఏట మొదలు

ఈ ప్రభుత్వం వచ్చాక మొదటి రెండేళ్లపాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు చేపట్టలేదు. గత టిడిపి హయాంలో పెండింగ్ పడ్డ బిల్లులను దశలవారీగా క్లియర్ చేశారు. ఇంకా అప్పటి బకాయిలు కొన్ని పెండింగ్‌లోనే ఉన్నాయి. ఎట్టకేలకు 2021-22 సంవత్సరానికి సంబంధించి యంత్రపరికరాలను నిరుడు మేలో ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె) స్థాయిలో రైతులతో గ్రూపులు ఏర్పాటు చేసి, ఒక్కో గ్రూపునకు రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను ఇవ్వాలనుకున్నారు. అందులో రైతుల వాటా 10 శాతం, బ్యాంక్ రుణం 50 శాతం, మిగతా 40 శాతం ప్రభుత్వ సబ్సిడీ. దాదాపు 5 వేల గ్రూపులకు రూ.175 కోట్ల సబ్సిడీ ఇస్తామన్నారు. ఇందులో కేంద్ర వాటా 60 శాతం, రాష్ట్ర వాటా 40 శాతం. ఆర్‌బికె స్థాయిలో ఏర్పాటు చేసే వైఎస్ఆర్ యంత్ర సేవా కేంద్రాలకు కంపెనీలు పరికరాలు సరఫరా చేశాయి. రైతుల షేర్, బ్యాంక్ లోన్ వచ్చినా ప్రభుత్వ సబ్సిడీ పూర్తిగా రాలేదు. కేంద్ర వాటాకు రాష్ట్రం తన వాటా జమ చేయకపోవడంతో కంపెనీలకు బిల్లులు ఆగిపోయాయి.

ఈ ఏడాది ఇంకా లేదు

2022-23 ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా నెలా ఇరవై రోజులే ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు యాంత్రీకరణ మొదలు పెట్టలేదు. రైతులకు ఈసారి వ్యక్తిగతంగా 50 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలిస్తామంటున్నారు.

కంపెనీలతో సంప్రదింపులు జరిపి కొన్ని నెలలు దాటినా అతీగతీ లేదు. పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా కొత్త పరికరాలు సరఫరా చేయబోమని సప్లయి సంస్థలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభుత్వం మాత్రం డ్రోన్లు, పైలెట్ల శిక్షణ అంటోంది.




"రేపటి చీకటి గుహలో
వినవస్తవి ప్రతిధ్వనులు
కాగడాల వెలుతురులో
కత్తులు దూసు జనులు!"

- ఆలూరి బైరాగి

మాతృభాషతోనే నేర్వగలం, నేర్వగలం!

సందర్భం



ఒక జన సమూహం ఫలానా వాళ్లు అని గుర్తించటానికి మొట్టమొదటి కొండ గుర్తు వారు మాట్లాడే భాష. మరి కాలక్రమేణా ఆ భాష వాళ్లు అనేక భాషలు నేర్చుకొని– అసలు భాషను, అదే అమ్మ భాషను వదిలేస్తే– వారు ఏమవుతారు? తమ తొలి సమూహం నుంచి దూరమవుతారు. మీరెవరు? అంటే– ఎవరో చెప్పుకోలేక దిక్కులు చూస్తారు.. తీర్థంలో తప్పిపోయిన చిన్న పిల్లాడిలా విలవిల్లాడతారు. అందుకనే– ప్రపంచంలోని ఏ తీరం చేరినా, బతకటానికి ఎన్ని భాషలు నేర్చినా– అమ్మ భాషను మర్చిపోకూడదు. మన మూలం ఎక్కడ ఉంది? అంటే– మన భాషాద్వారంలోంచి దర్శిస్తూ – 'అదిగదిగో ... అక్కడ ఉంది..' అని గర్వంగా చూపించాలి.

తెలుగు భాషకు వెయ్యేళ్లకు పైబడిన చరిత్ర ఉంది. విస్తారమైన సాహిత్యం ఉంది. అనేక సాహిత్య ప్రక్రియలు శాఖోపశాఖలై వర్ధిల్లాయి. జనజీవన స్రవంతిలోకి సజీవ పాయలుగా ప్రవహించాయి. పద్యాలూ పాటలూ, కథలూ కావ్యాలూ, నాటకాలూ నాటికలూ, ప్రబంధాలూ మహా గ్రంథాలూ ... ఆయా కాలాలను, జనజీవనాన్ని చిత్రించాయి. అన్నిటా తీయతీయని తెలుగు పలుకు వేకువల వెల్లువలా ప్రవహించింది. ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో తెలుగు కూడా ఒకటి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ; దేశంలోనూ, దేశం బయటా దాదాపు 16 కోట్ల మంది తెలుగు మాట్లాడతారని ఒక అంచనా. దేశంలో హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే భాష తెలుగే. తెలుగుకు ప్రాచీన భాష హోదా కూడా ఉంది. ఇవన్నీ మనం ఘనంగా చెప్పుకోవటానికి దోహదపడే సంగతులు. కానీ, తెలుగు వాడుక, వేడుక రోజురోజుకూ తరిగిపోతుందన్నది ఒక వాస్తవం. వెంటనే పెను ప్రమాదం లేకపోయినా– కొన్నేళ్లకు ప్రాభవం కోల్పోయే భాషల్లో తెలుగు కూడా ఉందనేది యునిసెఫ్ హెచ్చరిక.

ఏ భాష అయినా ఎందుకు అవసరం అవుతుంది? అంటే– 'మన అవసరాలు తీర్చుకోవటానికి...'. ఒక సమూహపు ప్రజల అవసరాలు, జీవనం ఆ సమూహానికే పరిమితం అయినప్పుడు– ఆ సమూహపు అమ్మభాషకు ఢోకా ఉండదు. ఇతర సమూహాలతో, ప్రాంతాలతో కలిసినప్పుడూ భాషకు ప్రమాదం వాటిల్లదు. మాటలను ఇచ్చిపుచ్చుకోవటం ద్వారా రెండు భాషలూ పరిపుష్టం అవుతాయి. ఇది భాష పుట్టినప్పటినుంచీ అనుభవంలో ఉన్నదే! కానీ, మన భాషకు మించి మరొక భాషకు ఆధిపత్య స్థానం ఇవ్వటం ప్రమాదకరం. అది క్రమేణా అమ్మభాష చెల్లుబాటును హరించి వేస్తుంది. ఇప్పుడు జరుగుతున్నది ఇదే!

భాష ఒక భావ వ్యక్తీకరణ సాధనం అని సాధారణ దృష్టికి అనిపిస్తుంది. కానీ, దానితో మనకు అంతకుమించిన బంధం ఉంటుంది. మనవైన అవసరాలను మన భాష మాత్రమే అర్థం చేసుకుంటుంది. ఉదాహరణకు మనకు కుటుంబం చాలా పెద్దది. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య, మావయ్య, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, అత్త, పిన్ని, బాబాయి, పెద్దమ్మ, వదిన, మరదలు, బావ, మరిది ... ఇలా ఇలా ఇంకా చాలా చాలా. ఇంత పెద్ద తెలుగు అనుబంధాల పిలుపులను ఇంగ్లిషు వచ్చాక– కత్తిరించి పడేసింది! అమ్మమ్మ, నాన్నమ్మ కలిపి గ్రాండ్ మా అయిపోయారు. అత్తా పిన్నీ, మావయ్యా బాబాయిలతో మనకు వేర్వేరు వరసల బంధం. ఆంటీ అంకుళ్ల పిలుపులతో మొత్తం ఒకటే వరస అయిపోయారు. వివరణ కావలిస్తే– మళ్లీ మనం మరోసారి అడగాల్సి ఉంటుంది. అమ్మ భాషలో అయితే– ఈ సమస్య లేదు. చిన్నత్త, పెద్దత్త, పెద్దన్నయ్య వంటి పిలుపుల్లో చాలా స్పష్టత ఉంటుంది. ఇలా మరింత నిర్దిష్టంగా, ఇష్టంగా మన పిలుపుల్లోని బంధాలను అనుసంధానించుకోవొచ్చు. మనవైన కొన్ని విషయాలను ఇంగ్లిషులో చెప్పటం కష్టం. మన వ్యవసాయంలోని తట్టా, బుట్టా, కంకి, కొడవలి, నాగలి, అరక, ఏరువాక, తూర్పారబట్టడం, మారు గొప్పు; ఆటపాటల్లోని అలుపూ సొలుపూ వంటి పదాలకు, వ్యక్తీకరణలకు పరాయి భాషా పదాలు స్ఫురించటం అంత సులువు కాదు. మన జనజీవనంలోని అనేక అనుభవాల్లోంచి జాతీయాలు, నానుడులు, సామెతలూ పుడతాయి. అవి ఒక్కమాటలో మొత్తం వ్యవహారం అర్థమయ్యేలా చేస్తాయి. 'వెంకడు అద్దంకి వెళ్లినట్టు...', 'గుమ్మడి దొంగా అంటే– భుజాలు తడుముకున్నట్టు', 'జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలినట్టు', 'నల్లేరు మీద నడక', 'గోధూళివేళ' వంటి మాటలు మనకు ఒక పెద్ద దృశ్యాన్నే కళ్లకు కడతాయి. క్షణంలో విషయాన్ని అవగతం చేస్తాయి. వృత్తిపరంగా, సంస్కృతిపరంగా, సామాజిక జీవనంపరంగా, ప్రాంతాల పరంగా– అనంతమైన పద సంపద, వాడుక మాటలూ మనకు పోగు పడి ఉన్నాయి. పరాయి భాషలో వ్యక్తీకరణ సాధ్యమవ్వొచ్చు కానీ, ఇంత లోతైన వాడుక సులభ సాధ్యం కాదు.

సొంత పలుకులోనూ ఆధిక్య ఘోష

ప్రపంచం మీద ఇంగ్లిషు ఆధిపత్యం ఉన్నట్టే– స్థానికీయ భాషలపైనా ఆ భాషలోని ఆధిపత్య తరగతుల ప్రాబల్యం, ప్రభావమూ ఉంటుంది. దానిని సవరించి, సరైన పద్ధతిలో వాడటానికి ప్రజాస్వామిక దృష్టి అవసరం అవుతుంది. తెలుగు గ్రామీణ ప్రాంతాల్లో 'నీచు' అనే మాట వాడుకలో ఉంది. ఒకప్పుడు 'మీది ఈ రోజు ఏం కూర?' అని అడిగితే– 'నీచు' అనే సమాధానం వచ్చేది. ఇప్పుడు 'ఎగ్స్' అనో, 'చికెన్ లేదా మటన్ అనో సమాధానం వస్తుంది. ఇక్కడ ఇంగ్లిషు పదాల వాడుక కన్నా కూడా 'నీచు' అనే తెలుగు పదమే అభ్యంతకరం. 'నీచు' అంటే నీచమైంది అని అర్థం. అది మాంసం తిననివారి ఏవగింపు వాడుక. వివక్షను గుర్తించిన తరువాత ఆ పదాన్ని పూర్తి వాడడం మానేయటమే ఉత్తమ పద్ధతి. కొన్ని కులాలను, మహిళలను తక్కువ చేసేవి, కొన్ని వృత్తులను హేళన చేసేవి మన అమ్మ భాషలోనూ బోలెడు సామెతలూ, పదబంధాలూ ఉన్నాయి. వాటన్నిటినీ వాడుకలోంచి తొలగించాలి. మనందరి భాషలా మన పలుకుబడిని సంస్క రించుకోవాలి.

ఆంగ్లం కూడా అవసరమే!

అమ్మభాషను రక్షించుకోవటం అంటే– ఇంగ్లీషు అసలు వద్దనే ధోరణికి పోవటం కూడా పొరపాటు. అవునన్నా, కాదన్నా నేడున్నది హద్దులు చెరుగుతున్న ప్రపంచం. జీవిక కోసం, అవకాశాల కోసం ఎక్కడివారు ఎక్కడికైనా వెళ్లాలి. అక్కడ రాణించాలి. దానికోసం ఇతర భాషలు నేర్చుకోవటం అనివార్యం. ఆ అవసరానికి అనుగుణంగా సిద్ధపడుతూనే – అమ్మ భాష అక్కున పెట్టుకొనే విధినీ నిర్వర్తించాలి. ఈ పని ఇంటా, బయటా, బడిలో మూకుమ్మడిగా జరగాలి. దీనిలో ప్రభుత్వాలదే ప్రప్రథమ బాధ్యత. పిల్లలకు ప్రాథమిక విద్యను అమ్మభాషలోనే అందివ్వటం దాని తొలి మెట్టు. సొంత భాషలోనే మనం ఎక్కువ ఆలోచించగలం... ఎక్కువ ఊహించగలం.. ఎక్కువ నేర్చుకోగలం. ఇది అంతర్జాతీయంగా అనేక పరిశోధనల తరువాత విద్యావేత్తలు నిర్ధారించిన నిజం. తొలుత అమ్మ భాషలో నిర్మాణ సూత్రాలు తెలిస్తే– దాని ఆధారంగా ఇతర భాషలు నేర్చుకోవటం సులభం. పిల్లలకు మొదటినుంచీ ఆంగ్ల మాధ్యమం అలవాటు చేస్తే– మాతృభాషా పరిజ్ఞానం లేకుండా పోతుంది. ఇటీవల వెలువడ్డ అసర్ నివేదికలోని అంశాలు చాలా ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. మన రాష్ట్రంలో ఒకటో తరగతి పాఠాలను అంతకన్నా పెద్ద తరగతి విద్యార్థులు దాదాపు 70 మంది చదవలేకపోతున్నారట! మాధ్యమం అయోమయంలో మన విద్యావ్యవస్థ చెల్లిస్తున్న మూల్యం ఇది. ఆంగ్లం సహా అన్ని భాషలనూ మన విద్యార్థులకు నేర్పొచ్చు.. ఆ నేర్చుకోవటానికి ప్రాథమిక దశ నుంచే ఆంగ్లం మాధ్యమంగా ఉండనవసరం లేదు. ఈ సర్వే చేసిన హెచ్చరిక అదే!

భాష అంటే– మాట్లాడడం ఒక్కటే కాదు; ఆ భాషా కళ్లద్దాలోంచి మన సంస్కృతిని, సంబంధాలను, మూలాలను అర్థం చేసుకోవటం. ఆ పరిజ్ఞానం ఉండాలంటే– సంభాషణకు మించిన సాహిత్యం, చరిత్ర తెలియాలి. దానికి తెలుగు చదవడం, రాయటం తెలియాలి. ఈ అంశానికి సంబంధించే చాలా వేగంగా సమస్య ముంచుకొస్తోంది. తెలుగు మాట్లాడేవారు ఉన్నా– చదివేవారు, రాసేవారు తగ్గిపోతున్నారు. ఇప్పటికే తెలుగేతర ప్రాంతాల్లో ఈ సంఖ్య గణనీయంగా ఉంది. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఆంగ్ల మాధ్యమం మూడు దశాబ్దాలుగా విస్తారంగా నడుస్తోంది. తరువాత ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆంగ్లమాధ్యమం మొదలైంది. ఈ చర్యలతో తెలుగు నేర్వని తరాలు చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ పరిణామాలు అమ్మభాషకు చాలా ప్రమాదకరమనేది భాషావేత్తలు, తెలుగు భాషాభిమానుల ఆవేదన, ఆందోళన. తల్లిదండ్రులు కోరుకుంటున్నారు కాబట్టి– ఆంగ్లమాధ్యమం పెట్టామని ప్రభుత్వ వాదన.

పాలకులదే పాపం!

ఆంగ్ల మాధ్యమం పట్ల అంతటి ఆసక్తిని రేకెత్తించటంలో ఏళ్ల తరబడి పాలకులు సాగించిన నిర్లక్ష్యమే మూల కారణం. ప్రభుత్వ పాఠశాలలను అనేక రూపాల్లో నిర్వీర్యం చేయటం, కొత్త అవసరాలకు అనుగుణంగా వాటిని బలోపేతం చేయకపోవడంతో– తల్లిదండ్రులు ప్రయివేటు వైపు మొగ్గటం ప్రారంభించారు. వేలకు వేల ఫీజు భారాన్ని భరించి మరీ పిల్లలను ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో శరవేగంతో పెరిగిన కార్పొరేటు విద్యా సంస్థలు కూడా తెలుగు భాషను కొత్త తరాలకు అందకుండా చేశాయి. ఇప్పటికైనా పాలకులు మేల్కొనటం అవసరం. ప్రాథమిక విద్యను తెలుగులోనే అందించటం, తరువాత తెలుగు ఒక అంశంగా బోధించటం చాలా అవసరం. నూతన ప్రపంచానికి అనుగుణంగా మనం సన్నద్ధం అవుతూనే– సొంత ఉనికిని, అస్థిత్వాన్ని, భాషాసంస్కృతుల పరిరక్షణ గురించి ఆలోచించాలి. ఈ బాధ్యతను మొక్కుబడిగా భావిస్తే– తెలుగునేలలో తెలుగు తెలియని తరాలు చాలావేగంగా పుట్టుకొస్తాయి. అమ్మభాష బలంగా లేని సమాజంలో పరాయి సంస్కృతి ప్రవేశించటం చాలా సులభం. సొంత విలువలు లేనిచోట ప్రతి కొత్త ధోరణీ అనుసరించదగిందిగానే కనిపిస్తుంది. భాష, సంస్కృతి సొంతవి కానప్పుడు, ఉన్నా బలహీనంగా ఉన్నప్పుడు– మనం మనలా లేనట్టే! మన మనుగడ మన చేతిలో లేనట్టే!

– సుజయ సాహితి

రంగస్థల విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన



నాటకం ఏ జానర్‌కు చెందినదైనా ఒకనాటి పౌరాణిక చారిత్రక లేదా ఆధునిక సమాజానికి దర్పణం పడుతుంది. అలాంటి వాతావరణం కళాత్మకంగా రంగస్థల వేదికను తీర్చిదిద్ది, రంగస్థల సంబంధిత అనుబంధ శాఖల సమన్వయంతో సకల కళల సమాహారంగా ఒక ప్రదర్శన రూపుదిద్దుకుంటే అది ఒక అపురూప రంగస్థలం ప్రదర్శనగా, ప్రేక్షకుల మదిలో చిరకాలం గుర్తుండిపోతుంది. వాటి గురించిన సమాచారం రంగస్థలం చరిత్రలో కొన్ని వాక్యాలుగా స్థానం సంపాదించుకుంటుంది.

ఒక శాస్త్రంగా రంగస్థల కళలను బోధించేవి, పరిశోధనకు తావిచ్చి త్రికాలాలను స్ఫురింప చేస్తూ, సంస్కృతీ సంప్రదాయ వారసత్వాలను బోధపరుస్తూ, ఆదాన ప్రదాన, వినిమయాలతో విశ్వ కళావేదికపై తమ తమ అస్తిత్వాలను స్థిరీకరించేందుకు దోహదపడేవి, విశ్వవిద్యాలయ ప్రదర్శన కళల విభాగాలు.

ఈనెల 11 12 13 తేదీల్లో హైదరాబాద్ విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ రెండో సంవత్సరం విద్యార్థులచే కాళిదాసు విరచిత 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకాన్ని, 'శకుంతల' పేరుతో 150 నిమిషాల పాటు ఒక కళాత్మక రంగస్థల రంగవల్లికగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని జి.బి.హాల్లో ప్రదర్శింపబడింది. మూల సంస్కృత నాటకానికి హిందీ అనువాదం, మోహన్ రాకేష్. దీన్ని విద్యార్థుల కోసం నాటకంగా తీర్చిదిద్దిన దర్శక గురువు, సీనోగ్రఫిస్ట్, సత్యబ్రత రౌత్.

ఈయన 2016లో సంగీత నాటక అకాడమీ ద్వారా సన్మానితులు. నాటక దర్శకుడిగా, కళాత్మక సౌందర్యాన్ని దృశ్యాత్మకంగా తీర్చిదిద్దడంలో సుశిక్షితులు. ఇప్పటి దర్శక దిగ్గంతి. 1983లో ఎన్ఎస్డిలో డిజైన్, డైరెక్షన్లో పట్టభద్రులు. ప్రపంచ ప్రసిద్ధమైన పలు సంస్థల్లో అధ్యయనం చేసిన వారు. బీవీ కారంత్ రచనలపై పరిశోధన చేసి పిహెచ్డి పట్టాను, 'న్యూ డైరెక్షన్ థియరీస్' అనే అంశంపై డి.లిట్ పొందారు. భారతీయ సమకాలీన నాటక రంగ సంబంధ బహు గ్రంథ రచయితగా గుర్తింపబడ్డారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయ బోధన విభాగంలో ప్రాచార్యులు.

శకుంతల నాటకం– మనిషి, ప్రకృతిల మధ్య సంబంధాన్ని, ప్రాచీన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, సామాజిక రాజకీయ అంశాలను పుణికి పుచ్చుకున్నదంటారు. పురుషాధిపత్య ప్రపంచాన్ని ప్రశ్నించిన నాటకం– శకుంతల అంటారాయన. మొదట తల్లిదండ్రులు, తర్వాత పెంచిన తండ్రి, ఆ తర్వాత భర్త, వీరందరి ద్వారా వంచిత కాబడిన స్త్రీ అంటారు. అలాంటి కొందరు స్త్రీలు తమ జీవితంలో ఏదో ఒక దశలో పురుషాహంకారం, వెలివేత దౌష్ట్యాలకు గురైన వారి ప్రతినిధి శకుంతల అంటారు. ఒరియా వాడైన సత్యవ్రత రౌత్ ఆ ఒడిస్సీ నుంచి సంప్రదాయ బద్ధమైన ముద్రలతో చతుర్విధ అభినయాలతో ప్రదర్శనను తీర్చిదిద్దారు. ఈ ప్రదర్శన పొడుగునా భారతీయ నాట్య శాస్త్ర సూత్రాలు, వాటి అనుగమనాన్ని గుర్తిస్తాడు ప్రేక్షకుడు. రంగస్థల కళాకారులతో పాటు ప్రేక్షకుడు కూడా అనుభూతికి లోనయ్యేవిధంగా, తన ప్రదర్శనలు తీర్చిదిద్దేవిగా చెబుతారు... ఈ సీనోగ్రఫిస్ట్, దర్శకుడైన రౌత్.

కాళిదాసు నాటకాల్లోని ప్రకృతి నేపథ్యం, అనుబంధం, పరోక్ష పాత్రను అద్వితీయమైన పోలికలు వర్ణనలతో కలగలిపిన దృశ్య ప్రధాన రసాత్మక కావ్యంగా తీర్చిదిద్దిన ఆణిముత్యంగా మురిసిపోతూ తన కళాభివ్యక్తికి ఉత్తమమైన రచనలుగా ఎంచుకొని వాటిని రంగస్థలంపై దృశ్య శ్రవ్య కావ్యాలుగా మలిచిన దర్శకుడు సత్యబ్రత రౌత్.

రాజా విక్రమాదిత్య ఆస్థానంలోని నవరత్నాల్లో ఒకడైన ప్రపంచ ప్రసిద్ధ కవి కాళిదాసు... ఐదవ శతాబ్దికి చెందిన నాటక రచయిత. కాళిదాసు మూడు నాటకాలు, రెండు పౌరాణిక కావ్యాలు, మరో రెండు లఘుకావ్యాలు రాశాడు. భారతీయ సౌందర్యాత్మక కావ్య రమణీయకతను అత్యున్నత శిఖరాలపై ఉంచిన కావ్య నాటక కర్తగా కాళిదాసు స్థానం ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

ఈ నాటక ప్రదర్శనలో అత్యధిక అంశాలను విద్యార్థులే సమకూర్చుకున్నారు. వాటిలో సంగీతం సెట్ డిజైన్, మాస్కులు, రంగస్థల సాధనాలు, లైటింగ్, దుస్తులు, రూపశిల్పకల్పన, సహ దర్శకత్వం మొదలైనవి ఆ శాఖలు. ప్రధాన సంగీత దర్శకులు అంజనాపురి, సత్యబ్రత రౌత్. పాటల రూపకల్పన ప్రియాంక మిశ్రా. నట్టువాంగం– వీరేంద్ర జానీ. కీబోర్డ్, నీలేష్ మనోహర్. సాంకేతిక సహకారం కన్హైయా లాల్ కైథ్వాస్. ప్రొడక్షన్ మేనేజర్ స్వరాలి దివార్. స్టేజ్ మేనేజర్, కదరుజ్జమాన్. ప్రచార విభాగాన్ని నిర్వహించిన విద్యార్థులు మొహమ్మద్ నవాజ్ ఖాన్, విద్యాసాగర్ లక్కినేని.

శిక్షణలో భాగంగా విద్యార్థులే అధిక భాగం రంగస్థల శాఖల్లో పని నేర్చుకుంటూ, దర్శక శ్రేష్ఠుల వద్ద పనిచేస్తూ, సూచనలు తీసుకుంటూ తమ తమ అభిరుచుల మేరకు నైపుణ్యాలను పెంచుకుంటుంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వీరు భారతీయ సంస్కృతి ఏకాత్మతకు ప్రతినిధులు. భావి భారత రంగ స్థలానికి దీపధారులుగా పని చేయడానికి తమ భవిష్యత్తును అంకితం చేస్తున్న వారందరికీ అభినందనలు.

చివరిగా ఈ నాటకం ఎందుకు చూడాలి, చూసి ఎందుకు గుర్తుపెట్టుకోవాలి? అంటే.. భారతీయ నాట్య సంస్కృతికి ప్రాతినిధ్యం వహించే నాటకాల రూపకల్పనలో విస్మరించరాని అంగాలైన, సూత్రధారి విదూషకుడు, కథానాయక, నాయికగా పాత్ర పోషణ, తమ నెచ్చెలి ఇష్టసఖులుగా, ఆమెలోని మానసిక భావోద్వేగ, ప్రణయోద్వేగాలను గమనిస్తూ, ప్రియునితో ప్రియసఖి సమాగం కోసం వారి వంతు దోహదం, పార్శ్వభాగాల్లో కనిపిస్తూ కథాకథనంలో భాగమౌతూ, లయాత్మక పాద హస్తముద్రలు పడుతూ, సంగీత స్వర నేపథ్య సారథులుగా ప్రదర్శనను విజయవంతం చేయడానికి ఏకోన్ముఖంగా,అంకిత మనస్కులు కావడం లోని నిబద్ధతలు.. శకుంతల నాటక ప్రదర్శన అలా అటు విద్యార్థులకు, ఇటు ప్రేక్షకులకు ఒక మధురానుభూతి!

– మల్లేశ్వరరావు ఆకుల, 79818 72655

ఒక ఆవు లేఖ

నా ప్రియమైన సోదరి సోదరులారా
నేను భారతీయ జంతువుని
అన్ని పశువులు నా తోబుట్టువులు
నేను కూడా కసువు తినే పశువుని

నారంగేంటో నాకు తెలియదు
నా జాతి నా వర్ణంతో
నా తోటి పశువుల్లోంచి విడదీసి
నన్ను అంటరానిది చేస్తున్నారు
తిని తాగిన అన్ని పశువులు
మలమూత్రాలు విసర్జించినట్టే
నేనూ వ్యర్థ మలినాల్ని వదుల్తున్నాను
లేకపోతే అనారోగ్యంతో చచ్చి పోతాను కదా!

నా శ్వాస క్రియలో ఆక్సిజన్ ఉందని
నా పేడతో పెంటగాన్ గోడలు అలికారని
పిడకలు తలకింద పెట్టుకుంటే పీడకలలు రావని
నా చుట్టూ అల్లిన కథల్లో
నన్నో బలి పశువుని చేశారు!

అయ్యలారా, అమ్మలారా ...
నా పేరుతో చేస్తున్న రక్తపాతానికి
కారణం నేను కాదు.. నేను మూగని
ఏ చావులకూ నన్ను నిందించొద్దు
రాజకీయ ఆటలో నన్నో అట్ట బొమ్మను చేసి
పార్లమెంట్లో మంట కాగుతున్నారు!

గోసేవ పేరుతో జరిగే అన్ని హింసలకు
తల్లిగా తల్లడిల్లిపోతున్నాను
నా పేరిట జరిపే కోట్లాది వ్యాపారానికి
పవిత్రతను అంటగట్టిన వేషగాళ్లను
నా గిట్టల కింద తొక్కి పడేయాలనుంది
కానీ, నేను నిస్సహాయురాలిని...


నేను అందరి మధ్య తిరిగే
మామూలు పెంపుడు జంతువుని
జనం రక్తాన్ని తాగేది నేను కాదు
ధనాన్ని హరించేదీ నేను కాదు
నాకు సీమంతాలు చేస్తూ
బారసాలలేసి ఊపుతూ
నా పాలల్లో బంగారపు గనులున్నాయని
నా పేడలో విటమిన్లు పుష్కలమని
మూత్రం తాగితే పుణ్యమని
కౌగిలించుకుంటే రోగాలు మాయమని
చెప్పేదంతా తంత్రగొండితనం!

ఓ గోసేవకులారా..
నేను బతికుండగా.. భారతీయ సనాతనం
అమాయకపు అఖ్లాక్ ను,
అమలాపురం ఏసోబును హత్య చేస్తుంది
ఈ రక్తపాతానికి కారణం కానేకాను నేను
నన్నో పశువుల్లో పశువుగా తలచండి
మీ ప్రేమను ఎప్పట్లా పంచండి!

ఇట్లు
ఒక అమాయక ఆవు

– నేలపూడి రత్నాజీ

ఎర్ర పుస్తకం



ఎర్ర పుస్తకం ఎర్ర పుస్తకం
బతుకునే తెలుపు పుస్తకం
నడకనే మార్చు పుస్తకం
నడతనే నేర్పు పుస్తకం //ఎ//

జరిగే అన్యాయాన్ని
సూటిగా చెప్పు పుస్తకం
మదిలో ఆరాటాన్ని
మంచిగా మార్చు పుస్తకం
చెవిలో జోరీగల్ని
దూరానికి తరుము పుస్తకం //ఎ//

నిజాన్నే నిజమని
ధైర్యంగా తెలుపు పుస్తకం
అన్యాయాన్ని ఎదిరించమని
కర్తవ్యం చెప్పు పుస్తకం
జీవితాకే అర్థాన్ని
ఇచ్చులే ఎర్ర పుస్తకం //ఎ//

కష్టాల కడలినే
దాటించును ఈ పుస్తకం
కష్టానికి కారణమెవరో
చెప్పునే ఈ పుస్తకం
ఎదురొడ్డి నిలవమని
అండగా నిలుచు పుస్తకం //ఎ//

కనబడే దారుణాలకు
కారణం తెలుపు పుస్తకం
జీవితాన్ని అభ్యుదయంగా
మార్చునే ఈ పుస్తకం
కన్నెర్రగ చేయమనే
ధైర్యమే కద ఈ పుస్తకం //ఎ//

– జంధ్యాల రఘుబాబు

నమ్మకమైన గురి

దీపం కత్తి పట్టుకుని
చీకటిపై యుద్ధం ప్రకటిస్తుంది 'వొత్తి'
తనువు చాలిస్తున్న
చలించని కాంతి నిబ్బరం వొత్తిది
అదృశ్య దారుల్లో వాయు వాగుపై
పరిమళాల్ని చిందేది 'పూలు'
నలిగిపోతున్న కొసల్లోనూ
రెప్పవాల్చని మెలుకువ స్వప్నం పూలది

పచ్చని పొద్దుల తాండవంతో
శూన్యం అందలంపై
శ్వాస దీపాల్ని మలిగిస్తుంది 'చెట్టు'
ఒట్టి బక్కచిక్కిన బర్రల వీపుమీదైనా
ఊపిరి పోసుకునే కలల వసంతం
చెట్టుది
పిడచకట్టిన మట్టి పెదవుల
సాలు దండెంపై వాలిన పచ్చల పిట్ట
'కవిత్వం'
వడిలిపోతున్న క్షణాల్ని వెంటేసుకొని
ఒక రెక్కతో నైనా శ్వాసించి వెలుగు వానై
కురిసే
నమ్మకమైన గురి 'కవిది'!


– ఈ.రాఘవేంద్ర
94940 74022



మానవత్వం ఏకం కావాలి

ఎంత చేదు కొసరినా
జీవితాన్ని అనుభవించక తప్పదు కదా
ఆరు పదులైనా ఏడు పదులైనా
జీవితాన్ని చంకన పెట్టుకొని సాగిపోవాలి
అనుభవాలన్నీ నలుగురితో పంచుకోవాలి మంచైనా
చెడైనా వొక దారి దొరుకుతుంది పిట్టల్లా
బంధువులు స్నేహితులు
అయినవారు కానివారు
అందరూ గంపగుత్తగా రాలిపోయాక
కనీసం కన్నీళ్లు పంచుకోటానికైనా
ఎవరికీ ధైర్యం చాలానప్పుడు
పలకరించే ముఖాలు కొత్తవే కావొచ్చు
శిథిలాల నుంచి పునర్జన్మ పొందిన
సంకోచం గుండెను గాయపరచవచ్చు
భయం ఆవహించినప్పుడు
పరాయితనం గురించి కాదు
గుండెను తాకిన క్షణం గురించి ఆలోచించాలి
ప్రపంచం యావత్తు ఒక వైపు
అగోచర భూకంప శత్రువు ఒకవైపు
జన సైన్యం కొనసాగిస్తున్న యుద్ధం మరోవైపు
కొడుకులు కూతుళ్లు కట్టుకున్న ఇల్లాలు ఒక ఎత్తైతే
అన్నలు తమ్ముళ్లు బంధువులు మరో ఎత్తై
తమలో ప్రవహిస్తున్న రక్తాన్ని అంటరానిది చేసినప్పుడు
నాలుగు జతల కాళ్లతో
భూ ప్రళయం అష్టదిగ్బంధనం చేసి
అందరూ ఉన్న అనాథని గుండెలకు హత్తుకుని
కర్త కర్మ క్రియని గీతార్థ సారంలో ముగించి
బైబిల్ ఖురాన్ గ్రంథ్ అవెస్తాలని తృప్తిపరుస్తూ
ఆపన్న హస్తమై ఆదుకొన్నవేళ
ఎలా మరువగలం మూర్తి భావించిన మానవత్వాన్ని
దైవం మానుష రూపేణ అన్న సత్యాన్ని.
అయినా యుద్ధం ముగియలేదు
ఆకు రాలే కాలం రుతువు మారలేదు
ప్రపంచం వొక సుదీర్ఘ యుద్ధాన్ని
మనోధైర్యంతో కొనసాగిస్తూనే ఉంది
శత్రువు ప్రత్యక్షమవుతునే వున్నాడు
మనిషి నుండి నిద్రని దొంగలించిన
శత్రువు కంటే మించిన విరోధి లేదు
ఊపిరి గుర్రం పైన స్వారీ చేస్తూ
ఒక్కసారి కోట్లకొద్ది సరాలు అందించగల ధనుర్ధారి
భూ ప్రళయాన్ని మట్టుబెట్టాలంటే
పిటికళ్లు కాదు
ప్రకృతి పైన జెండా ఎగురేయాలి
నీటికీ తిండికి వాచిపోయిన బాధితుల్ని ఆదుకోవాలి
కూటికి లేని వాళ్ళ నోటి ముద్ద కావాలి
మానసిక బొబ్బలకు బలం కావాలి
కష్టాల కడలిలో బాటలు పరుచుకోవాలి
అందరినీ ఆత్మీయంగా కలుపుకొని
ఆత్మవిశ్వాసం పెంచుకుంటే కానీ
మనోధైర్యం నింపగలిగితే కానీ
ఈ విపత్తును జయించలేము
కొండంత శత్రువును కంకర రాయిలా మార్చాలంటే
మానవత్వం ఒకే తాడుగా అల్లుకోవాలి
ప్రపంచ దేశాలే కాదు
ప్రతి మనిషీ మేలుకోవాలి!

– ఈతకోట సుబ్బారావు
94405 29785



బడ్జెట్‌కు ముందే ...

బడ్జెట్ కి ముందు రోజు రాత్రి
ప్రతిపక్ష నాయకుడు కనబడి
డెబ్భై ఏళ్ల గా చెప్పే మాటే
అంకెల గారడీ అని గట్టిగా చెవుల్లో అరిచాడు

ఒక స్త్రీ నాయకి స్వరం
ప్రజా వ్యతిరేకం అని
అప్పుడెప్పుడో ఆర్థిక శాఖను
ఉద్ధరించిన నోరొకటి
ఇది క్రూర బడ్జెట్ అని ..
పాలక పక్షం నాయకుడొకడు
అమృతోత్సవ బడ్జెట్ అని
గాల్లో చేతులుపుతూ,
నా కంటి ముందు అంకెలు పోశారు

ఎద్దు ఎలుగుబంటి
పరుగుపందెం లో పాదాల కింద పడి
విరిగిన సన్నకారు జీవుల బొమికల శబ్దాలు
పకపకా నవ్వుతున్న కార్పొరేట్ వ్యాపారి
దుఃఖాన్ని మొలిపిస్తూ కిరీటం లేని రైతు
సెలైన్ పెట్టుకున్న పెద్దాసుపత్రి
ఉక్కపోతతో ఉడుకుతున్న విశాఖ ఉక్కు

ఇప్పుడు నా ముక్కుపుటాలకు
మధ్య తరగతి ఆశల
కుళ్ళిన గుమ్మడి పండు వాసన తగుల్తోంది
నా గుండెల్లో
పగులుతున్న పేదల గుండె చప్పుళ్ళు
ఖాళీ బిందెలు కార్చే కన్నీళ్లు
చెట్టు కిందే సంసారం చేస్తు
నా వైపు దీనంగా చూస్తున్న యానాది చెంచయ్య

ఓ కవీ ..,
నీ వాక్యం నుంచి ఇల్లు నిర్మించు
నీ పదాల నుంచి నీళ్లు పుట్టించు
నీ వాక్యాలు
బడ్జెట్ లాంటివే అంటూ
హెచ్చరిక బోర్డొకటి
నా ఇంటి ముందు నాటేసి
పరుగెడుతున్న జనం కన్పించారు!

– డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

ప్రజాబలంతో త్రిపురలో పోరాటం

- అర్ధబలం, అంగ బలంతో బిజెపి : సీతారాం ఏచూరి
- రాష్ట్రంలో తిరిగి ప్రజాస్వామ్యం రావాలన్నదే ప్రజల ఆకాంక్ష
- స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఇసిని కోరాం..



అగర్తలలో జరిగిన సిపిఎం ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : అర్ధబలం, అంగబలంతో త్రిపుర ఎన్నికల్లో గెలవడానికి బిజెపి ప్రయత్నిస్తోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. కాంగ్రెస్‌తో అవగాహన చేసుకొని వామపక్షాలు ప్రజాబలంతో ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో తిరిగి ప్రజాస్వామ్య, రాజ్యాంగ బద్ధమైన పాలన ఏర్పడాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 16న జరగనున్నది. వామపక్షాలు, కాంగ్రెస్ ఒకే తాటిపై అధికార బిజెపిని ఎదుర్కొంటున్నాయి. బిజెపి వ్యతిరేక ఓటు చీలిపోకూడదనే ఉద్దేశంతోనే వామపక్షాలు, కాంగ్రెస్ అవగాహన కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం త్రిపురలో విస్తృతంగా పర్యటిస్తున్న ఏచూరి శనివారం న్యూస్ వెబ్‌పోర్టల్ 'న్యూస్ క్లిక్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

త్రిపురలో ప్రస్తుత పరిస్థితి ఏంటి? ప్రజల మూడ్ ఎలా ఉంది?

ప్రస్తుతం త్రిపుర ప్రజలు అధికార మార్పును కోరుకుంటున్నారు. గత ఐదేండ్లుగా దాడులు, బెదిరింపులతో సిపిఎంను దెబ్బకొట్టడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. అధికార బిజెపి ఎంతోమంది వామపక్ష కార్యకర్తలను పొట్టనబెట్టుకుంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ బద్ధమైన పాలన లేదు. ప్రజలు అణచివేతకు గురవుతున్నారు. దీంతో ప్రజలు స్వేచ్ఛను కోరుకుంటున్నారు. ఎన్నికల ర్యాలీల్లో ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఎన్నికల పోలింగ్ తేదీకి ఐదు రోజుల ముందు త్రిపురకు ప్రధాని మోడీ వస్తున్నారు. అమిత్ షా పర్యటించబోతున్నారు. రెచ్చగొట్టే ప్రసంగలతో ఓటర్లను ప్రభావితం చేయటమే వారి పని. అధికారం, ఆర్థిక బలంతో ఎన్నికల్లో గెలవాలన్నది బిజెపి వ్యూహం. ప్రజాబలంతోనే బిజెపిని ఓడించగలం. ఈ విషయాన్ని వామపక్షాలు, కాంగ్రెస్ ఓటర్లలోకి తీసుకెళ్తున్నాయి.

కాంగ్రెస్‌తో కలిసి వెళ్లటం కలిసొస్తుందా?

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని..వామపక్షాలు, కాంగ్రెస్ అవగాహన కుదుర్చుకున్నాయి. అధికార బిజెపిని ఓడించడానికి ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఒక్కటవ్వాలని పిలుపునిచ్చాం. వామపక్షాల పిలుపును ప్రజలు ఆమోదిస్తున్నారు. ఓట్లు చీలిపోకూడదనేది ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ప్రతిపక్షాల మధ్య ఓట్లు చీలితే..అంతిమంగా బిజెపికి లబ్ది చేకూర్చుతుందన్నది ప్రజలు గ్రహించారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాల్ని తెలుసుకున్నాకే, కాంగ్రెస్..మాతో జతకట్టింది. కొన్నాండ్లుగా వామపక్షాలు, కాంగ్రెస్ కలిసి నిరసన ర్యాలీలు చేపడుతున్నాయి.

తిప్రా మోతా.. ప్రభావం ఏమేరకు ఉంటుంది?

తిప్రా మోతా మాతో కలిసి రావాలని కోరాం. ఏమైందో తెలియదు..42 స్థానాల్లో అభ్యర్థుల్ని తిప్రా మోతా ప్రకటించింది. బిజెపి ఓటమే లక్ష్యమని మొదట్నుంచీ చెబుతున్న మోతా..ఎన్నికల సమయంలో అందుకు అనుగుణంగా వ్యవహరించలేదు. నిజానికి 18 స్థానాల్లో ఆ పార్టీకి సరైన అభ్యర్థులే లేరు. గిరిజనులు ఎక్కువగా ఉన్న స్థానాల్లో ప్రభావం చూపగలదన్నది మా అంచనా. గత ఎన్నికల్లో బిజెపి, ఐపిఎఫ్‌టి కలిసి పోటీ చేశాయి. ఆ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు తిప్రా మోతాలో చేరారు. ప్రాంతమేదైనా ప్రజల మూడ్..బిజెపికి వ్యతిరేకంగా ఉంది. బిజెపికి వ్యతిరేకంగా బలమైన అభ్యర్థి, పార్టీ ఏది? అన్నదే ముఖ్య అంశంగా మారింది. గిరిజన బెల్ట్‌లో బిజెపికి ఒక్క స్థానం కూడా రాదు.

త్రిపుర ఎన్నికల ద్వారా దేశ ప్రజలు అందుకునే సందేశం?

ప్రజలంతా ఒక్కటైతేనే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమనేది సందేశం. ప్రజలు మేల్కోవాలని అనేక సమావేశాల్లో స్వయంగా కోరాను. ప్రజాబలం ఒక్కటే బిజెపిని ఓడించగలదు. ఎన్నికల్ని స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని వామపక్షాలు కోరాయి. ఎన్నికల సంఘానికి అనేక రూపాల్లో ఫిర్యాదులు కూడా చేశాం. పోలీసు, ఎన్నికల అధికారులపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి. మద్యపానం, డబ్బు పంపిణీ కాకుండా..అడ్డుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే.



ఢిల్లీ-ముంబాయి ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభం

- దేశాభివృద్ధిలో బలమైన స్తంభం : ప్రధాని మోడీ

జైపూర్ : ఢిల్లీ-ముంబాయి ఎక్స్‌ప్రెస్‌వే దేశాభివృద్ధిలో బలమైన స్తంభంగా నిలవనుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోన్న ఈ ఎక్స్‌ప్రెస్‌వేలో భాగంగా ఢిల్లీ-దౌసా-లాల్‌సోట్‌ల మధ్య పూర్తయిన తొలిదశ రహదారిని ప్రధాని మోడీ ఆదివారం ప్రారంభించారు. రాజస్థాన్‌లోని దౌసాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతోపాటు రూ.18,100 కోట్లతో చేపట్టనున్న నాలుగు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. తొలిదశలో మొత్తం 247 కిలోమీటర్ల మేర ఈ రహదారిని ఎనిమిది లేన్లుగా రూ.10,400 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీనివల్ల ఇక మీదట మూడున్నర గంట్లలోనే ఢిల్లీ నుంచి జైపూర్‌కు చేరుకోవచ్చు. ప్రస్తుతం 5 గంటల సమయం పడుతోంది.

2019 మార్చి 9న ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఢిల్లీతోపాటు మధ్యలో అయిదు రాష్ట్రాలను (హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర) కలుపుతూ 1386 కిలోమీటర్ల మేర ఈ రహదారి వెళుతోంది. జైపూర్, అజ్మేర్, కోటా, ఉదయ్‌పుర్, చిత్తోర్‌గఢ్, భోపాల్, ఇండోర్, ఉజ్జయిని, అహ్మదాబాద్, సూరత్, వడోదరా వంటి ప్రధాన పట్టణాలను కలుపుతుంది. ఈ రహదారి పూర్తిగా సిద్ధమైతే ఢిల్లీ, ముంబాయి మధ్య ప్రస్తుతం ఉన్న దూరం 180 కిలోమీటర్ల మేర తగ్గుతుంది. ప్రయాణ సమయం సైతం 24 గంటల నుంచి ఏకంగా 12 గంటలకు తగ్గిపోతుంది. ఈ రహదారి నిర్మాణం కోసం 5 రాష్ట్రాల్లోని 15 వేల హెక్టార్ల భూమిని సమీకరించారు. సుమారు రూ.లక్ష కోట్లతో పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది చివరికల్లా ఈ ఎక్స్‌ప్రెస్‌వే పూర్తిగా అందుబాటులోకి వస్తుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

భారీగా గవర్నర్ల నియామకాలు

- 12 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు
- లడక్‌కు లెఫ్టినెంట్ గవర్నర్
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాలకు గవర్నర్లను, లడఖ్‌కు లెఫ్టినెంట్ గవర్నరు నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో కొత్తగా ఆరుగురిని గవర్నర్లుగా నియమించగా, ఏడుగురి గవర్నర్లను బదిలీ చేశారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా నియమించారు. తమిళనాడుకు చెందిన బిజెపి సీనియర్ నేత సిపి రాధాకృష్ణన్‌ను ఝార్ఖండ్ గవర్నరుగా నియమించారు. అరుణాచల్‌ప్రదేశ్ గవర్నరుగా రిటైర్డు లెఫ్టినెంట్ జనరల్ కైవల్యా త్రివిక్రమ్ పర్ణాయక్, సిక్కిం గవర్నరుగా లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, అస్సాం గవర్నరుగా గులాబ్ చంద్ కతారియా, హిమాచల్‌ప్రదేశ్ గవర్నరుగా శివప్రతాప్ శుక్లాను నియమించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత గవర్నరు విశ్వభూషన్ హరిచందన్‌ను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి గవర్నరుగా బదిలీ చేశారు. మహారాష్ట్ర గవర్నరుగా రాజీనామా చేసిన భగత్ సింగ్ కోశ్యారీ స్థానంలో ఝార్ఖండ్ గవర్నరు రమేష్ బైస్‌ను నియమించారు. ఛత్తీస్‌గఢ్ గవర్నరు సుశ్రీ అనుసూయను మణిపూర్ గవర్నరుగా నియమించారు. మణిపూర్ గవర్నరు గణేశన్‌ను నాగాలాండ్ గవర్నరుగా నియమించారు. బీహార్ గవర్నరు ఫాగు చౌహాన్‌ను మేఘాలయ గవర్నరుగా నియమించారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నరు రాజేంద్ర విశ్వనాథ్‌ను బీహార్ గవర్నరుగా నియమించారు. అరుణాచల్‌ప్రదేశ్ గవర్నరు బిడి మిశ్రాను లడఖ్ లెఫ్టినెంట్ గవర్నరుగా నియమించారు.

మోడీ పనిచేసినవారికే .. కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

ప్రధానమంత్రి నరేంద్రమోడీ పని చేసి ఆయనను ఇబ్బందుల నుంచి గట్టెక్కించినవారికే గవర్నరు పదవులు దక్కుతున్నాయని కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రత్యేకించి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా నియమించడంపై కాంగ్రెస్ ఎంపి మాణిక్కం టాగుర్ స్పందిస్తూ 'అదానీ కోసం మోడీ పనిచేస్తారు. మోడీ కోసం పనిచేసినోళ్లు గవర్నర్లు అవుతారు. ఇక ప్రజల కోసం పనిచేసేదెవరు?' అని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ కూడా తీవ్రంగా స్పందించారు. గతంలో బిజెపి సీనియర్ నేత అరుణ్ జైట్లీ చేసిన వ్యాఖ్యలను జైరాం గుర్తు చేస్తూ ట్వీట్ చేశారు. 'రిటైర్‌మెంట్ తర్వాత పదవులు ..రిటైర్‌మెంట్ కాబోయే ముందు ఇచ్చే తీర్పులు ప్రభావితం అవుతున్నాయి' అని గతంలో అరుణ్ జైట్లీ 2012లో ఒక సందర్భంలో పేర్కొన్నారు. ఇప్పుడు గవర్నర్ల నియామకాల నేపథ్యంలో జైట్లీ చేసిన ఆ వ్యాఖ్యల వీడియోనే జైరాం తిరిగి పోస్టు చేశారు.

16న ఎంసిడి మేయర్ ఎన్నిక

న్యూఢిల్లీ : ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలను ఈ నెల 16న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా అనుమతి ఇచ్చారు. ఫిబ్రవరి 16న సభను సమావేశ పరచేందుకు ప్రభుత్వం ప్రతిపాదన పంపిందని, సక్సేనా దానికి ఆమోదం తెలిపారని లెఫ్టినెంట్ గవర్నరు కార్యాలయ వర్గాలు తెలిపాయి. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం జనవరి 6న తొలి సమావేశం ఏర్పాటు చేయగా సభలో రసాభాస జరగడంతో వాయిదా పడింది. జనవరి 24న జరిగిన రెండో సమావేశం కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంది. దీంతో గత వారంలో మూడోసారి సమావేశం జరిగినప్పటికీ సభ రసాభాసగా ముగిసింది. లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేసిన 10 మంది ఢిల్లీ కౌన్సిలర్లు ఓటు వేసేందుకు అనుమతించడాన్ని ఆప్ అడ్డుకుంది. దీంతో మూడోసారి కూడా ఎలాంటి ఎన్నికకు నోచుకోకుండా సమావేశం వాయిదా పడింది. సుప్రీంకోర్టు కూడా నామినేట్ సభ్యులు ఓటు వేసేందుకు వీల్లేదంటూ తీర్పు ఇచ్చిన దరిమిలా 16న జరగనున్న నగర పాలక సంస్థ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 250 స్థానాలున్న ఢిల్లీ మున్సిపాలిటీకి గత డిసెంబర్ 4న ఎన్నికల్లో ఆప్ 134 సీట్లు గెలుచుకుని, మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు అవసరమైన సీట్లు గెలుచుకుంది. బిజెపి 104 వార్డులు గెలుచుకుని రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ 9 సీట్లు గెలుచుకుంది.

ఉత్తరాదిలో హిమపాతం.. స్తంభించిన జనజీవనం

శ్రీనగర్ : ఉత్తర భారతాన్ని మంచు దుప్పటి కప్పేసింది. హిమపాతంతో అక్కడి పరిసరాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. పెద్ద ఎత్తున మంచు కురుస్తుండటంతో ఆయా ప్రాంతాలు మంచు ఖండాలను తలపిస్తున్నాయి. మరోవైపు హిమపాతం కారణంగా జనజీవనం స్తంభించింది. భారీ హిమపాతం కారణంగా శ్రీనగర్-జమ్మూ మధ్య రోడ్డు రవాణా స్తంభించింది. విమాన సర్వీసులపై కూడా దీని ప్రభావం పడింది. 270 కిలో మీటర్ల జమ్మూ శ్రీనగర్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడుతుండటంతో ఆ మార్గాన్ని అధికారులు మూసివేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. రోడ్డుపై పెద్ద ఎత్తున పేరుకుపోయిన మంచును అధికార సిబ్బంది తొలగించే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో దాదాపు వెయ్యి వాహనాలు మంచులో చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. మంచులో చిక్కుకుపోయినవారికి ఆహారం, మంచినీటి వసతి కల్పించినట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లోనూ భారీగా మంచు కురుస్తోంది. చాలా జిల్లాల్లో హిమపాతం కొనసాగుతోంది. పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కేరింతలు కొడుతున్నాయి. హిమపాతం కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో రెండు జాతీయ రహదారులతో సహా 216 రహదారులను మూసేశారు. అత్యధికంగా శిమ్లా పరిధిలోని కోతి ప్రాంతంలో 20 సెంటీమీటర్ల మేర మంచు కురిసినట్లు వాతావరణశాఖ తెలిపింది. హిమాచల్‌లోని కీలాంగ్ ప్రాంతంలో అత్యల్పంగా మైనస్ 4.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



మహారాష్ట్రలో దారుణం

- 14 ఏళ్ల బాలికపై మేనమామ, బంధువు అత్యాచారం

ముంబయి : మహారాష్ట్రలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 14 ఏళ్ల బాలికపై సొంత బంధువులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కొంత కాలం క్రితం.. బోరివలి ప్రాంతంలోని తన మేనత్త ఇంటికి వెళ్లి అక్కడే ఉంటున్న బాలికపై ఆమె మేనమామతో పాటు మరో బంధువు అనేకమార్లు అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆమె మేనమామ వయస్సు 50 ఏళ్లు కాగా మరో బంధువు వయస్సు 19 ఏళ్లుగా పేర్కొన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బాధిత బాలికను దుండగులు బెదిరించినట్లు తెలుస్తోంది. చివరికి ఆ బాలిక విరార్ ప్రాంతంలోని మరో బంధువు ఇంటికెళ్లినప్పుడు జరిగిన విషయమంతా చెప్పడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన నాలుగు గంటల్లోనే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టంతో పాటు ఐపిసిలోని సెక్షన్ 376, 376(2)(ఎన్), 376(2)(ఎఫ్) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హానీట్రాప్‌లో పడి ఇద్దరు అధికారుల అరెస్టు

సిమిలిగుడ (నాసిక్) : ఓ యువతి వలపువల (హానీట్రాప్)లో పడి ఇద్దరు అధికారులు ముఖ్యమైన పత్రాలను లీక్ చేసి అరెస్టయిన ఘటన శనివారం నాసిక్‌లో చోటుచేసుకుంది. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా సునాబెడలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) లో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ ఉద్యోగులు నాసిక్‌కు చెందిన ఓ యువతి వలపు వల (హనీట్రాప్)లో చిక్కారు. వారిద్దరూ రక్షణ శాఖ పరిధిలోని హెచ్‌ఏఎల్ నుంచి ముఖ్యమైన పత్రాలను లీక్ చేసినట్లు తెలియడంతో సదరు సంస్థ ... ముఖ్యమైన సమాచారం లీక్ చేశారని ఆరోపిస్తూ సిబిఐ అధికారులకు సమాచారమిచ్చింది. శనివారం నలుగురు సిబిఐ అధికారులు సునాబెడకు చేరుకున్నారు. అక్కడి సంస్థలోని సీనియర్ అధికారి సత్యజిత్ ఖడంగా, మరో ఉద్యోగి దేబాశిస్ కుమార్ నాయక్‌లను నిన్న సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. రక్షణ శాఖ పరిధిలోని హెచ్‌ఏఎల్ నుంచి ముఖ్యమైన పత్రాలను లీక్ చేస్తున్న ఆరోపణలపై వీరిద్దరినీ సిబిఐ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యేను బెదిరించిన యువకుడు అరెస్టు

మహారాష్ట్ర : అభ్యంతరకర రీతిలో ఎమ్మెల్యేకు యువకుడు వీడియో కాల్ చేసి బెదిరించిన ఘటన మహారాష్ట్రలో జరిగింది. మహారాష్ట్రలోని మొహోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ విఠల్ మానేకు ఓ యువకుడు అభ్యంతరకర రీతిలో వీడియో కాల్ చేశాడు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎమ్మెల్యే ఫోన్ నంబరు సంపాదించిన ఆ యువకుడు యశ్వంత్‌కు అభ్యంతరకర రీతిలో వీడియో కాల్ చేసి దాన్ని రికార్డ్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. రూ.లక్ష ఇవ్వకపోతే ఆ వీడియోను అందరికీ పంపిస్తానని మెసేజ్ చేశాడు. దీంతో ఎమ్మెల్యే పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు రాజస్థాన్‌లోని భరత్‌పుర్‌కు చెందిన రిజ్వాన్ అస్లాం ఖాన్ గా గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో 90కిపైగా అశ్లీల వీడియోలు ఉన్నట్లు గుర్తించారు.

ప్రజా పంపిణీపైనా ప్రయివేటు కత్తి

- 'నీతి ఆయోగ్' సిఫారసులతో బడ్జెట్‌లో కోతలు
- ద రిపోర్టర్స్ కలెక్టివ్ వెల్లడి



న్యూఢిల్లీ : ఎన్నో కోట్ల కుటుంబాలకు ఆధారమైన 'ప్రజా పంపిణీ వ్యవస్థ' (పిడిఎస్)ను మోడీ సర్కార్ భారంగా భావిస్తోంది. కొత్త బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలపై భారీ ఎత్తున కోతలు పెట్టింది. వ్యయ నియంత్రణలు, ఉచిత ఆహార పథకం పరిధిని కుదించటమే లక్ష్యంగా కేంద్రం అడుగులు వేస్తోంది. పిడిఎస్‌ను ప్రయివేటుకు అప్పగించాలని, పథకం పరిధిని వీలైనంతగా కుదించాలని 'నీతి ఆయోగ్' ఇచ్చిన నివేదికను అమలుజేయడానికి కేంద్రం సిద్ధమైంది. 'నీతి ఆయోగ్' కేంద్రానికి సమర్పించిన నివేదిక పత్రాల్ని సేకరించిన 'ద రిపోర్టర్స్ కలెక్టీవ్' సంచలన విషయాలు బయటపెట్టింది. ఆహార భద్రత కార్యక్రమాలకు, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలుపై 'నీతి ఆయోగ్' వ్యతిరేకత వ్యక్తం చేసిందని ఈ పత్రాల్లో స్పష్టంగా ఉంది. ఆహార సబ్సిడీ పథకాలకు మంగళం పాడాలని కేంద్రానికి సూచించింది. ఈ నివేదికలోని అంశాల ఆధారంగా సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ కూడా దాఖలు చేసింది.

2021 జనాభాకు అనుగుణంగా పిడిఎస్ పథకాన్ని విస్తరించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ కొత్త బడ్జెట్‌లో కేంద్రం ఆహార సబ్సిడీలో పెద్ద ఎత్తున నిధులకు కోతలు విధించింది. ఇదంతా కూడా నిటి ఆయోగ్ సూచనలు, సిఫారసుల ప్రకారం జరిగిందని ప్రభుత్వ పత్రాలు చెబుతున్నాయి. కొత్త బడ్జెట్‌లో కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఆహార సబ్సిడీలో రూ.1.79,844 కోట్లమేర కోతలు విధించడానికి కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసిందని సమాచారం. ఆహార ధాన్యాల సేకరణ ప్రయివేటు, కార్పొరేట్ రంగాలకు అప్పగించాలని నిటి ఆయోగ్ సూచించింది. ప్రజా పంపిణీ పథకాల్లోనూ వాటి భాగస్వామ్యం తీసుకురావాలని కేంద్రానికి తెలిపింది. ఈమేరకు కేంద్రం తగిన కార్యచరణ చేపడుతోందని, 'నీతి ఆయోగ్' సూచనల మేరకు బడ్జెట్ గణాంకాలు వెలువడ్డాయని విశ్లేషకులు చెబుతున్నారు.

జొమాటో బాయ్‌బాయ్

- 225 నగరాల్లో సేవలు నిలుపుదల
- త్రైమాసిక ఫలితాల విడుదల సందర్భంగా వెల్లడి



ముంబయి : ప్రముఖ ఆహార డోర్ డెలివరీ సంస్థ జొమాటో భారత్‌లో తన కార్యాకలాపాలను భారీగా కుదించు కుంటోంది. ఇప్పటికే సిబ్బందిని తగ్గించు కున్న ఆ సంస్థ ఇప్పుడు సేవలను కుదిస్తోంది. దేశవ్యాప్తంగా 225 చిన్న నగరాల్లో తమ సేవలను నిలిపివేశామని జోమాటో ప్రకటించింది. మూడో త్రైమాసిక ఫలితాల నివేదికలో ఈ విషయాన్ని జొమాటో పేర్కొంది. గ్రాస్ ఆర్డర్ విలువ 0.3 శాతం మాత్రమే ఉండటంతో ఆయా నగరాల్లో సేవలు నిలిపేస్తున్నట్లు పేర్కొంది. కాగా సేవలు నిలిపేసిన నగరాలు ఏమిటనేది పేర్లు వెల్లడించలేదు. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ఈ కంపెనీ రూ.346.6 కోట్ల నష్టాలను నమోదు చేసింది. దీంతో ఇక నుంచి మెట్రో నగరాల్లోనే ప్రధానంగా దృష్టి సారించి కార్యాకలాపాలు సాగించాలని ఆ సంస్థ భావిస్తోంది. టెక్ సంస్థల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి తమ సంస్థలో ఉద్యోగాలిస్తామని గత నెలలో జొమాటో సిఇఒ దీపిందర్ గోయల్ గొప్పగా ప్రకటించారు. వివిధ విభాగాల్లో దాదాపు 800 మందికి అవకాశాలిస్తామని తెలిపారు. అయితే ఇదే జొమాటో గతేడాది చివరి రెండు నెలల్లో పనితీరు ఆధారంగా సంస్థలో మూడు శాతం సిబ్బందిని తొలగించింది. ఈ నేపథ్యంలో కంపెనీ 225 నగరాల్లో సేవలు నిలిపివేయడం వల్ల మరికొందరి ఉద్యోగాలు ఊడటం ఖాయంగా కనిపిస్తోంది.

కెనడాలో మరో వస్తువును కూల్చిన అమెరికా

- రెండు రోజుల్లో ఇది రెండోసారి



వాషింగ్టన్: అమెరికా సమీపంలో కెనడా గగనతలంలో ఎగురుతున్న మరో అనుమానస్పద వస్తువును అమెరికా యుద్ధ విమానం కూల్చివేసింది. గత రెండు రోజుల్లో ఇది రెండో ఘటన కావడం విశేషం. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆమోదం మేరకే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా అధ్యక్ష భవన్ వైట్‌హౌస్ ప్రకటించింది. ఉత్తర అలాస్కా తీరప్రాంత గగనతలంలో ఎగురుతున్న గుర్తుతెలియని వస్తువును కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. అధ్యక్షులు జో బైడెన్ ఆదేశానుసారం ఈ చర్యను చేపట్టినట్లు తెలిపింది. యుకోన్‌లోని కెనడా సేనలు కూలిన వస్తువు శకలాలను సేకరించి విశ్లేషించనున్నట్లు ట్రూడో వెల్లడించారు. ఈ అంశంపై ఎప్పటికప్పుడు అమెరికా అధ్యక్షులు, రక్షణ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. మరోవైపు చైనా నిఘా బెలూన్ ఘటనకు స్పందనగా అమెరికా పలు చర్యలు తీసుకుంటోంది. తాజాగా ఆ దేశానికి చెందిన ఆరు సంస్థలను నిషేధిత జాబితాలో చేరుస్తున్నట్లు ప్రకటించింది.

అస్సాంలో భూకంపం

- 4.0 తీవ్రతతో ప్రకంపనలు

గౌహతి : ఈశాన్య రాష్ట్రం అస్సాంలోని నాగోన్‌లో ఆదివారం సాయంత్రం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 4.0గా నమోదైందని జాతీయ భూకంప అధ్యయన కేంద్రం (ఎన్‌సిఎస్) సామాజిక మాధ్యమాల్లో పేర్కొంది. ఆదివారం సాయంత్రం 4.18 గంటల సమయంలో నాగోన్‌కు 10 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు ఎన్‌సిఎస్ ట్వీట్ చేసింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం నమోదు కాలేదని సమాచారం. గుజరాత్‌లో కూడా శుక్రవారం అర్ధరాత్రి భూమి స్వల్పంగా కంపించింది. రిక్టర్ స్కేల్‌పై 3.8 తీవ్రతతో ఈ ప్రకంపనలు వచ్చినట్లు ఎన్‌సిఎస్ తెలిపింది. సూరత్‌కు పశ్చిమ నైరుతి తీరాన 27 కి.మీ. దూరంలో 5.2 కి.మీ. లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఫిబ్రవరి మొదటి వారంలో మణిపూర్‌లోని ఉఖ్రుల్‌లో ఉదయం 6.14 గంటల సమయంలో స్వల్పంగా భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 4.0గా నమోదైందని ఎన్‌సిఎస్ తెలిపింది. భారత్‌కు కూడా టర్కీ, సిరియా కంటే తీవ్రమైన భూకంపాల ముంపు పొంచివుందన్న నిపుణుల ఆందోళన నేపథ్యంలో అస్సాంలో ప్రకంపనలు చోటుచేసుకోవడం స్థానిక ప్రజానీకంలో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి.

దయానంద ద్విశత జయంతి ఉత్సవాలు ప్రారంభం

న్యూఢిల్లీ : ఆర్య సమాజ్ వ్యవస్థాపకులు దయానంద సరస్వతి ద్వి శత జయంతి ఉత్సవాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. దయానంద 200వ జయంతి సందర్భంగా ఈ వేడుకలను ఏడాది పాటు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవ సూచికగా ప్రధాని ప్రత్యేక లోగో కూడా ఆవిష్కరించారు. 1824లో జన్మించిన దయానంద సమాజిక అసమానతలను రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారని మోడీ కొనియాడినట్లు ప్రధానమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సాంస్కృతిక, సామాజిక చైతన్యం కల్పించడంలో ఆర్య సమాజ్ ఎంతో కీలక పాత్ర పోషించిందని ఆయన తెలిపారు.

భూకంప మృతుల సంఖ్య 50వేలకు చేరొచ్చు

- ఐరాస రిలీఫ్ చీఫ్ మార్టిన్ గ్రిఫిత్ వెల్లడి



ఇస్తాంబుల్ : టర్కీ, సిరియా భూకంప ప్రభావం కనివిని ఎరుగని స్థాయిలో ఉంది. ఈ రెండు దేశాల్లో భూకంప మృతుల సంఖ్య 50వేలకు చేరుకునే అవకాశముందని ఐక్యరాజ్యసమితి ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే మృతుల సంఖ్య రోజు రోజుకీ భారీగా పెరుగుతోంది. శిథిలాలు తవ్వేకొద్ది వేల సంఖ్యలో మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటివరకు మొత్తం 29 వేల మందికిపైగా చనిపోయినట్లు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. టర్కీలో 24,617 మంది, సిరియాలో 4500 మంది మరణించినట్లు స్థానిక ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. టర్కీ, సిరియాలో భూకంపం ప్రాంతాల్లో సహాయక చర్యలు ఏడో రోజూ కొనసాగాయి. శిథిలాల కింద చిక్కుకున్న చిన్నారులు సహా అనేకమందిని సహాయక బృందాలు రక్షించాయి. దక్షిణ టర్కీ హతాయ్ ప్రావిన్స్‌లో శిథిలాల కింద చిక్కుకున్న ఓ వ్యక్తిని 140 గంటల తర్వాత బయటకు తీశారు. మరోవైపు టర్కీ దేశస్తులు తమ దేశంలోని బంధువుల ఇంట్లో తాత్కాలికంగా తలదాచుకోవచ్చని జర్మనీ తెలిపింది. ఈ విపత్కర పరిస్థితిలో తమవంతు సాయం అందిస్తామని చెప్పింది. ఇతర దేశాలు కూడా టర్కీకి ఆపన్నహస్తం అందిస్తున్నాయి. చైనా 53 టన్నుల టెంట్లను సాయంగా అందించింది. భారత్ ఇప్పటికే సహాయక బృందాలతో పాటు వైద్య బృందాలు, ఔషధాలు, ఇతర సామగ్రిని టర్కీకి పంపింది.

మృతుల సంఖ్య..ఇప్పుడే చెప్పలేం
- ఐక్యరాజ్యసమితి రిలీఫ్ చీఫ్ మార్టిన్ గ్రిఫిత్

సిరియా, టర్కీ భూకంప మృతుల సంఖ్యపై ఇప్పుడే ఒక అంచనాకు రాలేం. వాస్తవంగా మృతుల సంఖ్యను లెక్కించే పని ఐక్యరాజ్యసమితి ఇంకా చేపట్టలేదు. అయితే ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 50వేలకు చేరుకునే అవకాశముందని అంచనా వేస్తున్నాం. టర్కీ, సిరియా ప్రభుత్వాలు ఇప్పుడు ప్రకటిస్తున్న సంఖ్య కన్నా రెట్టింపు, అంతకన్నా ఎక్కువగా మృతులు ఉండే అవకాశముందని మా పరిశీలనలో తేలింది. టర్కీ, సిరియాల్లో దాదాపు 8.70 లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారని మా బృందాలు గుర్తించాయి. వీరికి అత్యవసరంగా ఆహార సాయం చేయాలని సహాయక బృందాలకు తెలిపాం. సిరియాలో తలదాచుకునేందుకు ఇల్లులేని వారి సంఖ్య 53లక్షలకు చేరుకుంది. భూకంప ప్రభావం 2.6 కోట్ల మందిపై ఉందని తెలిసింది.

సజీవంగా 2 నెలల చిన్నారి



టర్కీ, సిరియాలో సంభవించిన భూకంప మృతుల సంఖ్య 28,000 దాటింది. కొంత మంది శిథిలాల నుంచి ప్రాణాలతో బయటపడుతుండడం కొంత ఊరటనిస్తోంది. తాజాగా హతెయ్ ప్రాంతంలో శనివారం శిథిలాల కిందున్న ఓ రెండు నెలల చిన్నారిని సహాయక సిబ్బంది రక్షించారు. . భూకంపం సంభవించి 128 గంటల గడుస్తున్నా ఆ చిన్నారి శిథిలాల కింద సజీవంగా కనిపించడంతో అక్కడి వారి ఆనందానికి అంతేలేకుండా పోయింది. సిబ్బంది చిన్నారిని బయటకు తీసుకుని వస్తుండగా స్థానికులు పెద్ద ఎత్తున చప్పట్లు చరుస్తూ, ఈలలు వేస్తూ సంబర పడిపోయారు. ఇటీవలే సహాయక సిబ్బంది రెండు సంవత్సరాల ఓ బాలికను, ఆరు నెలల గర్భవతిని, 70 ఏళ్ల వద్ధురాలినీ కాపాడారు. ఈ భూకంపం ప్రపంచంలోనే ఏడో అతి భారీ విపత్తుగా రికార్డుల్లోకి ఎక్కింది. భూకంపం సంభవించి రోజులు గడుస్తున్నా కొందరు శిథిలాల కింద ప్రాణాలతో ఉండటం అక్కడి వారిలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.



మీకోసం

చెక్క చెంచాలు, గరిటెలు వాసన వస్తుంటే వాటిని కొద్దిసేపు వెనిగర్ కలిపిన నీటిలో ఉంచి వాడుకోవాలి.

జీవన సౌరభం

నిత్యం పనిచేసే శ్రామికుడిని చూసి ఓటమి భయపడుతుంది.

స్త్రీ విద్యాభివృద్ధికి కృషి



పిల్లలూ, ఈ రోజు స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి, సరోజినీ దేవి జయంతి. మరి ఆమె గురించి ముఖ్యమైన విషయాలు తెలుసుకుందామా!

ఈమె 1879వ సంవత్సరం ఫిబ్రవరి 13వ తేదీన హైదరాబాద్లో జన్మించారు. తండ్రి డా. అఘోరనాథ్ ఛటోపాధ్యాయా, తల్లి శ్రీమతి వరద సుందరీ దేవి. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ హైదరాబాదు కళాశాలకి, (అనగా నేటి నిజాం కళాశాల) మొట్టమొదటి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసారు. తల్లి వరదాదేవి రచయిత్రి.

సరోజినీ నాయుడు చిన్నతనం నుంచే కార్యదీక్షా, పట్టుదలతో చదివేవారు. తెలియని విషయాలు తెలుసుకోవడంలో నిరంతర కృషి కనబరిచేవారు. ఇంగ్లీషు భాష మీద చాలా మక్కువ ఉండేది. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్లో చదువుకున్నారు. పదకొండో సంవత్సరానికి అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఆ వయసులోనే ఇంగ్లీషులో రచనలు ఆరంభించింది కూడా!

ఆమె పన్నెండవ ఏట మద్రాసు విశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసింది. తన పదమూడవ 'సరోవరరాణి' పేరుతో రచన ప్రారంభించింది. ఇతరుల హృదయాలకు హత్తుకుని ఆలోచింపజేసే విధంగా కమ్మని శైలిలో రచనలు ఉండేవి. ఆ రోజుల్లో ఆమెలోని ప్రత్యేకతలు గ్రహించిన నిజాం నవాబు ఆమెను విదేశాలకు పంపారు. వివిధ శాస్త్రాలలో పరిశోధన చేసేందుకు ప్రోత్సహించారు. దాంతో సరోజినీ లండన్లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలోని గిర్టన్ కళాశాలలోనూ విద్యాధ్యయనం చేసి ఇంగ్లీషులోనూ అతి చక్కని గ్రంథాలు రాసింది. ఆమె రచించిన కావ్యాలలో 'కాలవిహంగం' 'స్వర్ణ ద్వారం', 'విరిగిన రెక్కలు' అనేవి చాలా ప్రసిద్ధమైనవి.

మహిళలకు విద్య అవసరమని భావించి 1906లో విద్యాభివృద్ధికి కృషి చేశారు. దేశమంతా ఎన్నో మహిళా సమావేశాలు ఏర్పరచి మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి పాటు పడ్డారు. స్వాతంత్ర్య సాధనలో తనూ పాలుపంచుకోవాలని భావించి కాంగ్రెస్ జాతీయ పార్టీలో చేరారు. 'జాతి వేరనీ, దేశం వేరనీ, నువ్వు వేరనీ విడిగా ఉండకు. నీకు జరిగితే దేశానికి జరిగినట్టే. దేశం అనుభవించే బానిసతనం నీవూ అనుభవించవలసినదే' అంటూ దేశమంతా తిరిగి దేశభక్తిని నూరిపోశారు.

కెనడా, అమెరికా మొదలైన దేశాలకు 1928లో వెళ్ళి భారతీయుల బానిసత్వాన్ని గురించీ వీరి ఆశయాల గురించీ ప్రచారం చేశారు. 1929లో తూర్పు ఆఫ్రికా అంతా ప్రచారం చేస్తూ పర్యటించారు. పీడిత భారత ప్రజల విముక్తికి ఆమె నిరంతరం ప్రయత్నాలు చేస్తూ ఉండేవారు. ఒక భారతీయ మహిళ చేస్తున్న ఉద్యమ ప్రచారానికి బ్రిటిష్ ప్రభుత్వం బెంబేలెత్తిపోయింది. 1930లో అరెస్టు చేసింది. అయినా ఆమె భయపడలేదు. ఎడతెగని ఉద్యమ ప్రచారాల్లో పాల్గొనేవారు. ఆమె సేవలు గుర్తించి ఉత్తరప్రదేశ్ గవర్నరు పదవి యిచ్చి సత్కరించారు. ఆమె తన డెబ్బైవ యేట 1949 మార్చి 2వ తేదీన లక్నోలో కన్నుమూశారు.

నేను గీసిన బొమ్మ





ఆద్య, బగాది, 4వ తరగతి, లిటిల్ ఏంజెల్స్ ఎం.వి.పి. కాలనీ, విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో..



పశ్చిమ బెంగాల్లో డార్జిలింగ్ జిల్లా, బరాజ్హరుజోట్ గ్రామానికి చెందిన అభా టోప్పో పేద కుటుంబానికి చెందింది. తండ్రి పేద రైతు. ఇద్దరు తమ్ముళ్లు. తినితినక గడిపిన రోజులు ఎన్నో. దాంతో ఆమెను తొమ్మిదవ తరగతితో చదువు మాన్పించారు. తర్వాత తల్లితో పాటు కూలి పనులకు వెళ్లింది. కొన్నాళ్లకు కౌలు రైతు అయిన భూషణ్కు ఇచ్చి పెళ్లి చేశారు. ఎన్నో ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టిన ఆమెకు రైతు అనుభవించే కష్టాలను నిత్యం చవిచూడసాగింది. భారీ నష్టం రావడంతో భూషణ్ వ్యవసాయం చేయడం మానేసి కూలి పనులకు వెళ్లసాగాడు. దాంతో అభా వ్యవసాయంలో నష్టాలు తప్ప లాభం ఉండదనే నిర్ణయానికి వచ్చింది. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత తానూ భర్తతో కలిసి టీ తోటల్లో కూలి పనులకు వెళ్లింది. రోజంతా కష్టపడితే రూ.35/- ఇచ్చేవారు. వాటితోనే ఇల్లు గడుపుతూ వచ్చారు. 16 ఏళ్లుగా కూలి పనులకు వెళుతూనే ఉంది. అయినా ఆర్థికంగా కుటుంబం మెరుగుపడకపోవడంతో నిత్యం నిరాశతో కుటుంబాన్ని నెట్టుకొచ్చారు.

ఒకప్పుడు అభా టోప్పో సామాన్య మహిళ. పేద కుటుంబానికి చెందిన వ్యవసాయ కూలి. ఇప్పుడు జిల్లాలోనే ఆదర్శ రైతు మహిళ. ఆ ఊరిలో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అనుభవజ్ఞులు సైతం వెనకడుగు వేసినా. ధైర్యంగా పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసింది. ఊహించని లాభాలు ఆమెకు పేదరికాన్ని దూరం చేశాయి. తాను పొందుతున్న ప్రతిఫలాలను తోటి రైతులకూ అందించాలనుకుంది. రైతు మహిళలకు శిక్షణనిస్తూ వారి జీవితాలను ప్రభావితం చేస్తుంది.

పదేళ్ల క్రితం ఊరికి వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చారు. గ్రామాన్ని సందర్శించారు. మహిళలతో సమావేశమై డ్రాగన్ ఫ్రూట్ను పండించమని, వాతావరణం అనుకూలంగా ఉంటుందని సూచించారు. లాభాలు బాగా ఉంటాయని చెప్పారు. ఆ మాటలు విన్న మహిళలు ఆ ఫ్రూట్ ఎలాగ ఉంటుందో కూడా తమకు తెలియదని, సాగు చేసి నష్టపోయేందుకు తాము సిద్ధంగా లేమని చెప్పారు. కాని అభా మాత్రం ఆలోచించింది. రిస్క్ తీసుకునేందుకు సిద్ధమైంది. తాను డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తానని ఇంట్లో చెప్పినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. ఆ పంట సాగు తెలియకుండా ఎలా పెంచుతావని అభ్యంతరం తెలిపారు. అయినా డ్రాగన్ సాగుకు ఆసక్తి చూపింది.

నార్త్ బెంగాల్ యూనివర్సిటీకి వెళ్లింది. డ్రాగన్ ఫ్రూట్ ఫార్మింగ్ కోసం వర్క్ షాప్ల్లో పాల్గొంది. అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలు ఆమెలో నమ్మకం కలిగించాయి. తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు అభా ఆ మొక్కలు కొని తీసుకువచ్చింది. పావు ఎకరం భూమిలో 123 పిల్లర్లు పాతింది. వాటికి మొక్కలు పెట్టి సాగు చేసింది. అప్పుచేసి పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తున్న అభాను ఊరిలో వారంతా నిరుత్సాహపరిచారు. 'పండకపోతే ఏం చేస్తావు?...ఎప్పుడో వచ్చే పంటకు ఇంత డబ్బు పెట్టడం అవసరామా?' అన్నారు. అందరూ ఆ మొక్కలను చూసి ముళ్ల మొక్కలు ఎలా పెంచుతున్నావ్ అంటూ నవ్వారు. దాంతో ఆలోచనలో పడ్డ అభాకు భర్త ధైర్యం చెప్పాడు. సాగుకు సహాయం అందించారు. మొక్కలకు నీళ్ల పెట్టడం, అవసరమైన ఎరువులు వేయడం చేశాడు. వాతావరణానికి తగ్గట్టుగా మొక్కలను కాపాడుకుంటూ వచ్చింది. 18 నెలలు తర్వాత పూలు వచ్చాయి. దాంతో అభా సంతోషానికి అవధుల్లేవు. అభా నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా నమ్మకంగా ఉన్నారు. కొన్ని నెలలు తర్వాత ఫలాలుగా మారాయి. పండిన తర్వాత కిలో రూ.400 చొప్పున వినియోగదారులకు నేరుగా అమ్మారు. తాము రెండు సంవత్సరాలు పాటు పడిన కష్టాన్ని చూసుకుని ఇంటిల్లిపాది ఆనందపడ్డారు.

కోవిడ్ సమయంలో ఈ పండ్లకు ఎంతో డిమాండ్ వచ్చింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి జనం వచ్చి పండ్లను కొనుగోలు చేశారు. దాంతో గ్రామంలో కొంతమంది మహిళ రైతులు తామూ సాగు చేస్తామని అభాను కోరారు. గత మూడు ఏళ్ల నుంచి అభా వారికి శిక్షణ ఇస్తోంది. సీజన్లో తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు చెబుతుంది. వారి కుటుంబ ఆదాయానికి కృషి చేస్తోంది.



సంవత్సరానికి 5 టన్నుల పండ్లు పండిస్తూ రూ.2లక్షల లాభం సంపాదిస్తున్న అభా ఉత్తర బెంగాల్లో డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయం ప్రారంభించిన మొదటి మహిళగా పేరు తెచ్చుకున్నారు. మొదట ఈ పండ్ల సాగుకు ఎవరూ ముందుకు రాకపోయినా మార్పుకు అడుగు వేసిన అభాను ఇప్పుడు అక్కడ రైతులంతా అభినందిస్తున్నారు.

నువ్వుల్లో పోషకాలు

నువ్వుల్లో ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్, ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన పిండిపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు, కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, ఫ్యాట్స్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీహిస్టమెన్స్ ఎక్కువగా ఉంటాయి. అందుకే రోజూవారి ఆహారంలో భాగంగా చేర్చుకుంటే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.

- వీటిలో ఉన్న ఐరన్ జింక్, కాల్షియం వల్ల విటమిన్ 'ఇ' సమృద్ధిగా లభిస్తుంది. రక్తహీనతతో బాధపడే మహిళలు వీటిని తింటే నీరసం తగ్గుతుంది.



- మోకాళ్ళ, శరీర నొప్పులతో నిత్యం బాధపడే వారు నువ్వులు, బెల్లం కలిపి ఉండలు చేసుకుని తింటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- వీటిలో పీచు పదార్థం అధికంగా ఉండి జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. వీటిలో వుండే ఫైటో స్టెరాల్స్ వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఉత్పత్తి తగ్గుతుంది. దాంతో గుండె సంబంధిత వ్యాధులు రాకుండా చూస్తుంది.
- నల్ల నువ్వుల్లో క్యాన్సర్ నివారించే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి బ్రెయిన్లో ట్యూమర్ గ్రోత్ను నివారిస్తాయి. హృదయనాళాలను చురుకుగా పనిచేసేలా చేస్తోంది.
- వీటిల్లో 20 శాతం ప్రొటీన్లు, కాల్షియం ఉంటాయి. దెబ్బలు తగిలినప్పుడు త్వరగా మానటానికి సహకరిస్తాయి.
- నువ్వుల నూనెలో ఉండే ప్రోటీన్లు శరీరంలో అధిక రక్తపీడనాన్ని అదుపు చేస్తుంది.
- వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో ప్లాస్మాలోని గ్లూకోజ్ స్థాయిలను పెంచుతుంది.
- ఇన్ని ప్రయోజనాలు ఉన్న నువ్వుల నూనెను అప్పుడప్పుడు జుట్టుకి పట్టించి, శుభ్రం చేసుకుంటూ ఉంటే వెంట్రుకలు నల్లగా మారి ఆరోగ్యంగా పెరుగుతాయి.

చిన్న కథలైనా వినోదాత్మకంగా

సంక్రాంతి తర్వాత పెద్ద హీరోల సినిమాలు విడుదల కాలేదు. దాంతో చిన్న సినిమాలు థియేటర్స్లో విడుదలకు వరసకట్టాయి. ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్ ఉంటే ఓటీటీలో విడుదలైనా, థియేటర్స్లో విడుదలైనా విజయం వరిస్తుందని చాలా సందర్భాల్లో ఎదురైన అనుభవమే. ఈ వారం విడుదలైన రైటర్ పద్మభూషణ్, బుట్ట బొమ్మ, మైఖేల్, హంట్, డ్రైవర్ జమున, ఎటిఎం వరుసగా విడుదలయ్యాయి. వీటిలో రైటర్ పద్మభూషణ్ మంచి టాక్ తెచ్చుకుంది. ప్రచారం లేకపోయినా మంచి కన్సెప్టితో సినిమా తీస్తే విజయం తప్పకుండా వరిస్తుందని నిరూపించుకుంది. మరి ఆ కథలు ఎలా ఉన్నాయో చూద్దాం.



దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ కథ ద్వారా ఏం చెప్పాలనుకున్నాడో చిత్రంలో స్పష్టంగా చూపించారు. ఓ రైటర్ తాను రాసిన రచనలను జనం చేత చదివించేలా చేయాలని పడే తపన, పడే కష్టం హృదయ విదారకం. కొడుకు ప్రయోజకుడు కావాలని కోరుకునే తల్లి ఎలా మార్గదర్శిగా నిలుస్తుందో చూపిస్తూ... ఆడపిల్ల ఏం కావాలని కోరుకుంటుందో కుటుంబ సభ్యులు తప్పకుండా తెలుసుకోవాలని చెప్పిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. హీరోహీరోయిన్ల ప్రేమ, సందర్భానుసారం కామెడీ థియేటర్స్లో నవ్వులు పండించింది. కథకు తగ్గట్టుగా హీరో పాత్రకు నటుడు సుహాస్ను ఎంచుకోవడం కరెక్టుగా సూటయ్యింది. మధ్య తరగతి కుటుంబీకుల ఆలోచనా ధోరణి ఎలా ఉంటుందో కొన్ని పాత్రల ద్వారా చూపించి కథ అందరికీ కనెక్టు అయ్యేలా చేశారు.






మలయాళంలో విజయవంతమైన 'కప్పెల'కు రీమేక్గా రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఈ కాలం అమ్మాయిల ఆలోచనలు ఎలా ఉంటాయో చిత్రం ద్వారా చూపించారు. కెమెరా ఫోన్ కొనుక్కోని..రీల్స్ చేసి ఫేమస్ అవ్వాలన్నది హీరోయిన్ కల. కానీ ఓ రాంగ్ నంబర్తో పరిచయమైన హీరోని ప్రేమించడం, అతని కోసం ఇంట్లో నుంచి పారిపోవడం వంటివి నిజ జీవితాల్లో జరిగే సంఘటనలను తలపిస్తాయి. ఆడపిల్లల పట్ల జరిగే మోసాలు, అకృత్యాలు ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్టు చూపించారు. పాత అంశమే అయినా మరోమారు ఆలోజింప చేసింది.



క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్ కథతో వచ్చిన 'డ్రైవర్ జమున' ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఐశ్వర్య రాజేష్ మెయిన్రోల్లో నటించిన ఈ చిత్రానికి పి.కిన్స్లిన్ దర్శకత్వం వహించారు. తండ్రి చనిపోవడంతో కుటుంబ బాధ్యతలు తీసుకున్న ఓ యువతి క్యాబ్ డ్రైవర్గా మారుతుంది. ఓ రాజకీయ నాయకుడిని హత్య చేసిన ముఠా తన క్యాబ్ ఎక్కడం, క్రైమ్లో తననీ భాగం చేయడం కథలో ఊహించని మలుపు ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. ఆమె సవాళ్లను ఎదుర్కొంటూ బయటపడిన విధానం ఆద్యంతం ఉత్కంఠతో చివరి వరకూ చూసేలా చేసింది.



బిగ్బాస్తో ఫేమస్ అయిన వీజే సన్నీ నటించిన చిత్రం 'ఏటీఎం'. సి. చంద్రమోహన్ దర్శకత్వం వహించారు. పేద కుటుంబానికి చెందిన యువకుల ఆలోచనలు, అవసరాలు తీర్చుకునేందుకు దొంగతనాలు చేయడం మామూలుగా అనిపిస్తాయి. కాని హీరో వేషధారణ, ఎమోషన్స్ ఆసక్తి కలిగిస్తుంది. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనుకునే హీరో, అతని స్నేహితులు 'ఎటిఎం'లో దొంగతనానికి పాల్పడటం పోలీసులకు దొరకుండా ఎత్తుకు పై ఎత్తులు వేయడం ఆకర్షణీయంగా ఉంటుంది. పోలీసు అధికారి అయిన సుబ్బరాజు పాత్రలో మెప్పించాడు. ట్విస్ట్ రివీల్ చేస్తూ సినిమా ముగింపు ఇవ్వడం అభిమానులకు ఎంతగానో నచ్చింది.

వీటితో పాటు మరికొన్ని చిత్రాలు ఈ మధ్యకాలంలో ఓటీటీ వేదికగా విడుదలైయ్యాయి. బట్టర్ఫ్లై, లవ్టుడే, జయజయజయజయహే, మట్టికుస్తీ వంటి చిత్రాలు ఎంతో వినోదాత్మకగానూ, సందేశాత్మకంగానూ ఉన్నాయి. మంచి అంశాలను కథలుగా మలిచి సినిమాలు తీస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారు. అందుకు ఈ సినిమాల పట్ల జనం చూపిస్తున్న ఆసక్తే అందుకు నిదర్శనం.

రఫ్ఫాడించిన రోడ్రిగ్స్

పాకిస్తాన్పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు.. మహిళల టి20 ప్రపంచకప్

కేప్టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన గ్రూప్-2 తొలి లీగ్ మ్యాచ్లో భారత్ ఏడు వికెట్ల తేడాతో పాకిస్తాన్పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్కు దిగిన పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 149పరుగులు చేసింది. ఛేదనలో భారతజట్టు 19 ఓవర్లలో కేవలం 3వికెట్లు మాత్రమే కోల్పోయి 150 పరుగులు చేసింది. గెలిచింది. టీమిండియా గెలుపులో మిడిలార్డర్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్(53నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్ను గెలిచింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ను భారత బౌలర్లు కట్టడి చేశారు. ఓపెనర్లు మునీబా(12), జెవేరియా ఖాన్(8)లను త్వరగా ఔట్ చేశారు. నిదా ధర్(0) కూడా డకౌట్ కావడంతో పాక్ జట్టు 43 పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత అమీన్(11) కూడా నిరాశపరచడంతో పాక్ జట్టు 12.1ఓవర్లలో 68పరుగులకే 4వికెట్లు కోల్పోయింది ఆ దశలో కెప్టెన్ మరూఫ్(68నాటౌట్), అయేషా(43) మరో వికెట్ పడకుండా జట్టు మారూఫ్ బాధ్యతాయుతంగా ఆడారు. కెప్టెన్ మరూఫ్ 55బంతుల్లో 7బౌండరీల సాయంతో 68పరుగులతో అజేయంగా నిలిచింది. చివర్లో ఆయేషా నసీమ్ 25 బంతుల్లో 2ఫోర్లు, 2సిక్సర్ల సాయంతో 43 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లలో రాధా యాదవ్కు రెండు, దీప్తి శర్మ, పూజా వస్త్రాకర్కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియా ఓపెనర్ యస్టికా భాటియా (17), షెఫాలీ వర్మ(33) రాణించారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్కు 5.3 ఓవర్లలో 38పరుగులు జతచేశారు. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్(16) నిరాశపరిచినా.. జెమిమా రోడ్రిగ్స్(53నాటౌట్), వికెట్ కీపర్ రీచా ఘోష్(31నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రోడ్రిగ్స్కు లభించగా.. 15న భారత జట్టు వెస్టిండీస్తో తలపడనుంది.


ఆస్ట్రేలియా ఘన విజయం

పార్ల్: న్యూజిలాండ్తో జరిగిన గ్రూప్-1 లీగ్ మ్యాచ్లో ఆస్ట్రేలియా జట్టు 97పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 173పరుగులు చేసింది. హీలే(55), లానింగ్(41), ఫెర్రీ (40) బ్యాటింగ్లో మెరిసారు. న్యూజిలాండ్ బౌలర్లు తహుహు, అమేలియా కెర్ర్కు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 14ఓవర్లలో 76పరుగులకే కుప్పకూలింది. అమేలియా కెర్ర్(21), జెస్ కెర్ర్(10), బెర్మాడినే(14) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. గార్డినర్కు ఐదు, స్కట్కు రెండు వికెట్లు దక్కాయి.



పాకిస్తాన్ మహిళల ఇన్నింగ్స్: మునీబా అలీ (స్టంప్) రీచా (బి)రాధా 12, జెవెరా ఖాన్ (సి)హర్మన్ (బి)దీప్తి 8, మరూఫ్ (నాటౌట్) 68, నిదా ధర్ (సి)రీచా (బి)పూజ 0, అమీన్ (సి)రీచా (బి)రాధా 11, అయేషా (నాటౌట్) 43, అదనం 7. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 149పరుగులు. **వికెట్ల పతనం:** 1/10, 2/42, 3/43, 4/68 **బౌలింగ్:** రేణుక 3-0-24-0, దీప్తి 4-0-39-1, గైక్వాడ్ 4-0-31-0, రాధా 4-0-21-2, పూజ 4-0-30-1, షఫాలీ 1-0-3-0,

ఇండియా మహిళల ఇన్నింగ్స్: యస్టికా భాటియా (సి)ఫాతిమా (బి)సదియా ఇక్బాల్ 17, షెఫాలీ వర్మ (సి)అమీన్ (బి)నష్రా సంధు 33, జమిమా రోడ్రిగ్స్ (నాటౌట్) 53, హర్మన్ప్రీత్ (సి)మరూఫ్ (బి)నష్రా సంధు 16, రీచా ఘోష్ (నాటౌట్) 31, అదనం 1. (19 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 151పరుగులు. **వికెట్ల పతనం:** 1/38, 2/65, 3/93 **బౌలింగ్:** ఫాతిమా 4-0-42-0, సదియా ఇక్వాల్ 4-0-25-1, అల్మన్ అన్వర్ (3-0-33-0, నిదా ధర్ 4-0-36-0, నష్రా సంధు 4-0-15-2.



సినీ హీరో మాధవన్ కుమారునికి ఏడు పతకాలు

ముంబయి: సినీ నటుడు ఆర్ మాధవన్ కుమారుడు వేదాంత్ మాధవన్ స్విమ్మింగ్లో పతకాల పండిస్తున్నాడు. ఖేలో ఇండియా గేమ్స్-2023 స్విమ్మింగ్ విభాగంలోని వివిధ కేటగిరీల్లో ఏడు పతకాలు ఆధించాడు. మహారాష్ట్ర తరపున ప్రాతినిధ్యం వహించిన వేదాంత్ (6 గోల్డ్, 1 సిల్వర్) ఏడు పతకాలతో అదరగొట్టాడు. దీంతో సినీ హీరో మాధవన్ కొడుకు వేదాంత్ ప్రదర్శనతో ఉబ్బితబ్బిబై పోతూ.. మహారాష్ట్ర జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశాడు. కాగా, గతేడాది డానిష్ ఓపెన్లో బంగారు పతకం గెలవడం ద్వారా వేదాంత్ తొలిసారి వార్తల్లోకెక్కాడు

ఫైనల్లో సౌరాష్ట్ర, బెంగాల్

రంజీట్రోఫీ సెమీఫైనల్స్

ఇండోర్: రంజీట్రోఫీ సీజన్-2022-23 ఫైనల్లోకి సౌరాష్ట్ర, బెంగాల్ జట్లు ప్రవేశించాయి. తొలి సెమీఫైనల్లో సౌరాష్ట్ర జట్టు 4వికెట్ల తేడాతో కర్ణాటకను ఓడించగా... రెండో సెమీస్లో బెంగాల్ జట్టు 306పరుగుల తేడాతో మధ్యప్రదేశ్ జట్టుపై ఘన విజయం సాధించింది. బెంగళూరు వేదికగా జరిగిన సెమీస్లో కర్నాటక జట్టు రెండో ఇన్నింగ్స్లో 234పరుగులకు ఆలౌట్ కావడంతో సౌరాష్ట్ర జట్టు 117పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఆ లక్ష్యాన్ని సౌరాష్ట్ర జట్టు 34.2ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి ఛేదించింది. మరో సెమీస్లో బెంగాల్ నిర్దేశించిన 547పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మధ్యప్రదేశ్ జట్టు 241పరుగులకు కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆకాశ్ దీప్కు లభించింది. 16నుంచి కోల్కత్తా వేదికగా బెంగాల్-సౌరాష్ట్ర జట్ల మధ్య రంజీట్రోఫీ ఫైనల్ జరగనుంది.

WPL WOMEN'S PREMIER LEAGUE

వేలానికి వేళాయే!

డబ్ల్యూపిఎల్ క్రికెటర్ల వేలం నేడు

ముంబయి: బిసిసిఐ ఈ ఏడాది నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న మహిళల ప్రీమియర్ లీగ్కు సర్వం సిద్ధమైంది. ఐదు జట్లు, రూ.60 కోట్ల నగదు, 90 స్థానాలు.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) ఆరంభ సీజన్ క్రికెటర్ల వేలం సోమవారం జరగనుంది. ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్లో జరిగే ఈ మెగా వేలంలో ప్రపంచ క్రికెట్లో ఎంతో మంది మహిళా క్రికెటర్లను కోటీశ్వరులు చేయనుంది. భారత స్టార్ క్రికెటర్లకు వేలంలో భారీ డిమాండ్ ఉండనుండగా.. సుమారు 90 మంది మహిళా క్రికెటర్ల జీవితాలు ఆర్థికంగా గొప్ప మలుపు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. డబ్ల్యూపిఎల్ క్రికెటర్ల వేలం నేడు మధ్యాహ్నం 1.30నుంచి ప్రారంభం కానుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68